



# మాయా భవనం

వీరగిరి రాజ్యంలో ఎక్కడ చూసినా ప్రజల ఆనంద కోలాహలం; ఎక్కడ విన్నా యువరాణి విద్యావతి జన్మదినోత్సవాల గురించే మాట! జన్మదినోత్సవాలకు ఇంకా మూడు వారాల వ్యవధి ఉన్నది. అయినా, అప్పుడే ప్రజలలో వేడుకల హడావుడి ఆరంభమయింది. యువరాణి తన బంధుమిత్రులతో కలిసి, ఆలయానికి వెళ్ళి, దేవీ దర్శనం చేసుకుని ప్రధాన వీధులగుండా రాజప్రాసాదం చేరడం— జన్మదినోత్సవంలో ప్రధాన కార్యక్రమం. అందువల్ల ఉదయం, సాయంకాలం వీధులను శుభ్రపరుస్తున్నారు. ముత్యాల ముగ్గులతో, పచ్చటి ద్వారతోరణాలతో వీధులన్నీ కళకళలాడసాగాయి. యువరాణి దర్శన భాగ్యం ఎప్పుడు కలుగుతుందా అని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఎదురు చూడసాగారు.

అయితే, యువరాణి జన్మదినోత్సవానికి మూడు రోజుల ముందు, రాజభటులు చేసిన చాటింపు విని వీరగిరి ప్రజలు దిగ్భ్రాంతులయ్యారు. యువరాణి హఠాత్తుగా వ్యాధిగ్రస్తురాలు కావడం వల్ల జన్మదినోత్సవాలు రద్దు చేస్తున్నామని రాజు ప్రకటించడంతో ప్రజలు ఆశాభంగానికి గురయ్యారు.

ప్రజలలాగే, వీరపురి రాజు వీరసేనుడూ, రాణి వజ్రేశ్వరీదేవీ తమ ఏకైక కుమార్తె విద్యావతి పరిస్థితిని చూసి విచారగ్రస్తులయ్యారు. ఇంతకు పూర్వం



ఎప్పుడు గాని విద్యావతి స్వల్ప అనారోగ్యానికి సైతం గురైనది లేదు. అలాంటిది మూడు రోజులక్రితం ఆమె ఉదయం పడకనుంచి లేవలేక పోయింది. పరిచారిక శాలిని ఆమెను లేపి కూర్చోబెట్టడానికి ప్రయత్నించింది. విద్యావతి అతి కష్టం మీద లేచి నిలబడిందిగాని, మరుక్షణమే తూలి పడక మీద పడిపోయింది. అంతే, అప్పటి నుంచి ఆమె అలాగే నీరసంగా పడివున్నది!

విషయం తెలియగానే రాణి వజ్రేశ్వరీ దేవి, విద్యావతి శయన మందిరానికి వచ్చింది. ముఖం పాలిపోయి, ఎన్నాళ్ళనుంచో దీర్ఘవ్యాధితో బాధపడుతూన్న దానిలా కదలా మెదలక వున్న తన కుమార్తెను చూడగానే రాణి కడుపు తరుక్కుపోయింది. రాజు కూడా తన కుమార్తెను చూసి ఒక్కక్షణం నిర్విణ్ణుడయ్యాడు. రాజవైద్యుణ్ణి పిలిపించాడు. వైద్యుడు యువరాణి నాడి పరీక్షచేసి, చూశాడు. అతనికి ఆమె శరీరంలో ఎలాంటి వ్యాధి లక్షణాలూ కనిపించలేదు. అయినా, ఆమె పడకపై నుంచి లేవలేక పోతున్నది. వ్యాధి కారణం అంతుబట్టక, రాజవైద్యుడు రాజుతో, "ప్రభూ, యువరాణికి ఇప్పుడు ఎలాంటి మందులూ వద్దు. రెండు మూడు రోజులు పరిశీలించి చూసి, ఆ తరవాత ఔషధచికిత్స ప్రారంభిద్దాం. అంతవరకు ఆమెకు విశ్రాంతి అవసరం," అన్నాడు.

రాజు సరేనని తల పంకించాడు.

రాణివజ్రేశ్వరీదేవి, ఆ రోజంతా యువరాణి పక్కనే కూర్చున్నది. విద్యావతి ప్రశాంతంగా నిద్రపోయింది. సాయంకాలం రాజవైద్యుడు వచ్చినప్పుడు కళ్ళు తెరిచి, "ఇంకా నీరసంగానే ఉన్నది. ఆకలి లేదు!" అన్నది.

రాజవైద్యుడు ఆమెకు పళ్ళరసం మాత్రం ఇవ్వమన్నాడు.

రెండవ రోజు కూడా మొదటి రోజు లాగే గడిచింది. ఆ రోజు రాత్రి రాణికి ఒక వింత

అనుభూతి కలిగింది. ఆమె కళ్ళు మూసుకుని పడుకుని వుండగా హఠాత్తుగా చల్లటి స్పర్శ ఏదో తగిలి కళ్ళు తెరిచింది. తెల్లటి దయ్యం లాంటి ఆకారం ఒకటి గది నుంచి బయటకు వెళ్ళడం ఆమెకు లీలగా కనిపించింది. అయినా దాని ముఖం స్పష్టంగా కనిపించలేదు. అది ఆడా, మగా అన్న సంగతి కూడా తెలియలేదు. ఒకవేళ కిటికీ నుంచి పడుతూన్న వెన్నెల కిరణాలను తను దయ్యంగా భ్రమపడ్డానేమో అనుకుని రాణి పడుకుని కళ్ళు మూసుకుంది. కొంతసేపటి తరవాత మళ్ళీ అదే స్పర్శ. రాణి ఉలిక్కిపడి లేచింది. దయ్యమూ లేదు; వెన్నెల కిరణాలూ లేవు. నిద్రపోతూన్న రాజును లేపి సంగతి చెప్పింది. అంతా విన్న రాజు, "దేవీ, విద్యావతి పరిస్థితి గురించి ఆలోచిస్తూ పడుకుని వుంటావు. ఏదో కల వచ్చింది, అంతే. మన అమ్మాయికి ఎటువంటి ఆపదా రాదు. నిశ్చింతగా నిద్రపో," అని రాణిని ఓదార్చాడు.

మూడవ రోజు తెల్లవారగానే రాజవైద్యుడు వచ్చాడు. విద్యావతి ఆరోగ్యంలో ఎలాంటి మార్పూ కనిపించలేదు. ఆమెను పరిశీలించి చూసి, వైద్యుడు, మూడు పూటలా సేవించడానికి కొన్ని బలవర్ధక ఔషధాలు ఇచ్చి వెళ్ళాడు.



రాజు, ఆ రోజు సాయంకాలం, యువరాణి అనారోగ్య కారణంగా, ఆమె జన్మదినోత్సవాలను రద్దు చేస్తున్నట్టు చాటింపు చేయించాడు. పదహారు సంవత్సరాలుగా ఇంతవరకు ఇలా ఎప్పుడూ జరగలేదు. యేటా యువరాణి దేవాలయానికి వెళ్ళేప్పుడు, రాజవీధిలో దారికి ఇరువైపులా బారులుతీరి నిలబడి, ఆనందోత్సాహాలతో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసేవారు ప్రజలు. ఈ యేడు వేడుకలు లేవనగానే, యువరాణికి ఏమయిందోనని కలవరపడసాగారు. రాజవీధిలో అక్కడక్కడ గుంపులు గుంపులుగా చేరి, తమలో తాము చర్చించుకోసాగారు. మరి



కొందరు రాజప్రాసాదం ముందు గుమి గూడి, భవనం లోపలి నుంచి వెలుపలికి వచ్చే భటులను అడిగి యువరాణి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోసాగారు!

యువరాణి జన్మదినానికి ఒక్క రోజు ముందు, రాజభటుడొకడు రాజప్రాసాదం నుంచి వెలుపలికి వచ్చి, అక్కడ గుమిగూడిన ప్రజలకు, ''ప్రస్తుతం యువరాణి ఆరోగ్యం కొంత మెరుగయింది. ఆమె మెల్లగా లేచి కూర్చోగలుగుతున్నారు. రేపు యువరాణి జన్మదినం సందర్భంగా దేవాలయాలన్నిటా ప్రత్యేక పూజలు జరిపించమని రాజుగారు ఆజ్ఞాపించారు. ప్రధాన జ్యోతిషాచార్యుడు వాచస్పతిని సంప్రదించడానికి రాజుగారు స్వయంగా బయలుదేరి ఆయన వద్దకు వెళ్ళారు!'' అని తెలయజేశాడు.

ఆ వార్త విని ప్రజలు కాస్త ఊరట చెంది, ఇళ్ళకు వెళ్ళారు. మరునాడు వేకువజామునే ప్రజలు దేవాలయాలకు వెళ్ళి, యువరాణి అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలనీ, ఆయురారోగ్యాలతో ఆమె చిరకాలం వర్ధిల్లాలనీ ప్రార్థనలు జరిపారు.

ప్రధాన జ్యోతిషాచార్యుడు వాచస్పతి, రాజువెంట రాజభవనానికి వచ్చి, యువరాణి జాతకాన్ని కొంతసేపు ఏకాగ్రచిత్తంతో పరిశీలించి చూసి, ''మహారాజా! యువరాణి జన్మించినప్పుడే, ఆమె జాతకాన్ని గణించి, ఆమెకు పదహారో యేట ఒక గండం వుందని చెప్పాను, కదా?'' అన్నాడు.

''మాకది జ్ఞాపకం లేదు, ఆచార్యా! విద్యావతి శిశుప్రాయం నుంచి, ఎటువంటి అనారోగ్యానికీ గురికాలేదు. ఎంతో ఆనందంగా కనిపించేది. ఆమెకు ఇలాంటి పరిస్థితి ఏర్పడగలదని ఊహించడానికి సైతం మాకు అనుమానం కలగలేదు. ఇప్పుడు కూడా ఆమెను పరిశీలించిన రాజవైద్యుడు ఆమెలో ఎలాంటి వ్యాధి లక్షణాలూ కనిపించడంలేదన్నాడు. మరెందు

కీమె నీరసించిపోయిందో అంతుబట్టడం లేదు!" అన్నాడు రాజు విచారంగా.


పక్కనే వున్న రాణి వజ్రేశ్వరీదేవి, "ఈ రోజు విద్యావతి పుట్టినరోజు. యేటా ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా జరపడం ఆనవాయితీ. అది మన దేశ ప్రజలకెంతో ఆనందకరమైన విషయం. విద్యావతి సంపూర్ణ ఆరోగ్యంతో మామూలు మనిషి కాగలదా, ఆచార్యా!" అని అడిగింది ఎంతో ఆదుర్దాగా.

వాచస్పతి మళ్ళీ తదేక దీక్షతో విద్యావతి జాతకచక్రాన్ని పరిశీలించసాగాడు. కొంతసేపు మౌనంగా ఆలోచించి, తల పైకెత్తి, "యువరాణి జాతకం ప్రకారం ఒక సంవత్సరం నుంచే గ్రహ సంచారం శుభ ప్రదంగా లేదు. కొన్ని గ్రహాల ఉగ్ర దృష్టి జాతకురాలిపై బడింది. అందుకే ఇప్పుడామె పరిస్థితి ఇలా అయింది. అయినా, ఇలాగే ఎంతోకాలం కొనసాగదు. సరిగ్గా చెప్పాలంటే, ప్రస్తుత గ్రహస్థితి మారడానికి పదకొండు నెలలా పదకొండు రోజులు పడతాయి. ఆ తరవాత ఆమె మామూలు మనిషి అవుతుంది. అంత వరకు ఆమెను జాగ్రత్తగా కాపాడాలి. ముఖ్యంగా, ప్రస్తుతం వుంటూన్న ఈ భవనం నుంచి ఆమె నివాసం వేరొక చోటికి మార్చడం అవసరం!" అన్నాడు.



"ఈ స్థితిలో అమ్మాయిని ఎక్కడికి పంపగలం ఆచార్యా?" అని అడిగింది మహారాణి సజలనేత్రాలతో.

జ్యోతిషాచార్యుడు ఏమీ మాట్లాడలేదు. కొంతసేపు అందరూ మౌనం వహించారు. ఆ తరవాత రాజు, "రాజధానీ నగరాన్ని ఆనుకుని వున్న సారససరోవరం మధ్య వున్న దీవిలో వేసవి విడిది కని నిర్మించిన విశ్రాంతి భవనం వున్నది. యువరాణిని అక్కడికి తరలించడం మంచిదనుకుంటాను. అది ఇక్కడికి సమీపంలోనే ఉన్నది కాబట్టి, మేము రోజూ వెళ్ళి రావడానికి అనువుగానూ వుంటుంది!" అన్నాడు.




"సారససరోవరం ఇక్కడికి ఆగ్నేయ దిశలోనే కదా ఉన్నది?" అని అడిగాడు జ్యోతిష్కుడు.

అవును అన్నట్టు రాజు తల పంకించాడు.

"అలాంటప్పుడు యువరాణిని అక్కడ వుంచడం అన్ని విధాలా శ్రేయస్కరం. మరొక ముఖ్య విషయం ఏమంటే యువరాణి అక్కడ ఏకాంతంగానే గడపాలి. తల్లిదండ్రుల దృష్టి కూడా ఆమెపై పడకూడదు. ఆమెకు తోడుగా ఒక పరిచారిక మాత్రం వుంటే చాలు. వారికి ఆహారపానీయాలు రాజభవనం నుంచే పంపవచ్చు. జననీజనకులైన మీరు కూడా ఆమెను నెలకొక్కసారి మాత్రమే వెళ్ళి చూసి రావాలి. మీ కుమార్తె క్షేమం కోసం దీనిని మీరొక తపస్సులాగా భావించి నడుచుకోవాలి. ఇవన్నీ తాత్కాలికమే. గ్రహదోషం తొలగిపోగానే యువరాణి మామూలు మనిషి అవుతుంది. ఆ వెంటనే ఆమెకు వివాహయోగం కూడా ఉన్నది. కాబట్టి మీకు ఎటువంటి విచారమూ వద్దు. భగవంతుడి మీద భారం వేసి నిశ్చింతగా వుండండి. నేను బయలుదేరేప్పుడు ఇంటివద్ద జగత్పతాచార్యుడు వున్నాడు. ఈ విషయం ఆయనతోనూ సంప్రదించి, మీరు యువరాణిని చూడడానికి శుభ సమయం ఏదో వచ్చి చెబుతాను," అని చెప్పి అక్కడి నుంచి బయలుదేరాడు.

ఆ తరవాత జరగవలసిన పనులన్నీ చకచకా జరిగిపోయాయి. విడిది భవనాన్ని సిద్ధం చేయడానికి, రాజు భటులను పంపాడు. విద్యావతి పుట్టినప్పటి నుంచి, ఆమె అవసరాలు చూసుకుంటూన్న రాణిగారి వృద్ధపరిచారిక కమలను, యువరాణితోపాటు పంపాలని రాణి నిర్ణయించింది. యువరాణికీ, పరిచారికకూ కావలసిన ఆహారపానీయాలను రాజప్రాసాదం నుంచి అరుగురు చెలికత్తెలు రోజుకు ఇద్దరు ప్రకారం తీసుకువెళ్ళాలని


RAZI

ఏర్పాటు జరిగింది. కమల ఒక్కతే యువరాణి దగ్గర వుంటుంది.


జ్యోతిషాచార్యుడి సలహా ప్రకారం, సరిగ్గా అర్ధరాత్రి సమయంలో, యువరాణి రాజప్రాసాదం నుంచి, మేనాలో బయలు దేరింది. రాజూ, రాణీ యువరాణిని రాజ ప్రాసాద సింహద్వారం వరకు వచ్చి సాగనంపారు. వృద్ధ పరిచారిక కమలతో పాటు మరిద్దరు చెలికత్తెలు, సారససరోవరం వరకు యువరాణికి తోడుగా వెళ్ళి దిగబెట్టారు. పడవవాడు, యువరాణినీ, పరిచారిక కమలనూ మాత్రం పడవలో ఎక్కించుకుని, సరోవరమధ్యంలో వున్న దీవిలోని విశ్రాంతి భవనం మెట్ల వద్ద దించి, కొంతసేపటికి తిరిగి వచ్చి, ఆ విషయాన్ని అక్కడ నిలబడిన పరిచారికలకు తెలియజేశాడు.

తమ కుమార్తె నుంచి ఇలా హఠాత్తుగా దూరం కావలసి వచ్చిన విధివైపరీత్యాన్ని తలుచుకుని రాజదంపతులు తీరని విచారానికి లోనయ్యారు. ఒకరినొకరు ఓదార్చుకుంటూ, కుమార్తెను చూడడానికి తగిన శుభఘడియలు ఏవో చెప్పడానికి జ్యోతిషాచార్యుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూడసాగారు.

యువరాణికి ఏర్పడిన స్థితిని గురించి దేశప్రజలకు తెలియజేయడానికి రాజు, భటులను దేశం నలుమూలలకూ పంపాడు. వచ్చే సంవత్సరం యువరాణి జన్మదినోత్సవాలను మరింత ఘనంగా ఏర్పాటు చేయగలమనీ అంతవరకు ప్రజలు జరిగినదానికి దిగులు పడకుండా తమ కర్తవ్యాలను ఎప్పటిలాగే నిర్వర్తించాలని రాజు చాటింపు చేయించాడు. ఆ చాటింపు విని ప్రజలు కొంత ఊరట చెందారు. కొన్ని రోజులు దేశమంతటా ప్రశాంతత చోటు చేసుకున్నది.

ఒకనాడు వేకువజామున, సారససరోవర విశ్రాంతి భవనంలో వుంటూన్న యువరాణి విద్యావతి, హఠాత్తుగా మాయమయిందన్న వార్త వినగానే దేశప్రజలు దిగ్భ్రాంతులయ్యారు. —(ఇంకా వుంది)






# మాయా భవనం

## 2

[వీరగిరి యువరాణి విద్యావతి జన్మదినోత్సవం మూడు రోజులు ఉందనగా, యువరాణి అంతుబట్టని బలహీనతకు లోనయింది. ప్రధాన జ్యోతిషాచార్యుడి సలహా ప్రకారం ఆమెను సారస సరోవర విడిదిభవనానికి తరలించారు. రెండు నెలలు గడిచాక యువరాణి విడిది భవనం నుంచి హఠాత్తుగా అదృశ్యమయింది. ఆమె అదృశ్యం కావడానికి ముందు ......]

యువరాణి విద్యావతిని సారససరోవరం వరకు వెళ్ళి దిగబెట్టి వచ్చిన శాలిని, మాలిని అనే పరిచారికలే మరునాడు తెల్లవారగానే యువరాణికి కావలసిన ఆహారపానీయాలను తీసుకుని విడిది భవనానికి బయలుదేరారు. పడవవాడు వాళ్ళను పడవలో విడిదిభవనం మెట్ల వద్ద దించాడు. యువరాణి ఆ రాత్రి ప్రశాంతంగా నిద్ర పోవడం వల్ల, ఆమె ఎంతో ఉత్సాహంగా వుండడం చూసి పరిచారికలు సంతోషించారు. యువరాణికి స్నానాదులు చేయించి, భోజనం పెట్టారు. ఆ తరవాత పరిచారికలు రాజభవనానికి తిరిగివచ్చి, యువరాణిలో వచ్చిన మంచి మార్పును గురించి మహారాణి వజ్రేశ్వరీదేవికి తెలియజేశారు. రాణి ఆ శుభవార్తను ఎంతో ఆనందంతో రాజుకు తెలియజేసింది. విద్యావతి నివాస



స్థానంలో, జ్యోతిషాచార్యుడు చేసిన మార్పు కారణంగా, విద్యావతి పరిస్థితిలో అప్పుడే అభివృద్ధిని సూచించే లక్షణాలు కనిపించడంతో రాజదంపతులు పరమానందం చెందారు.

రెండవ రోజు నందిని, దేవయాని అనే పరిచారికలు యువరాణికి భోజనం తీసుకుని వెళ్ళారు. మూడవ రోజు శాంత, శారద అనే పరిచారికలు భోజన ఫలహారాలు ఇచ్చి వచ్చారు. రోజు రోజుకూ విద్యావతి కోలుకుంటున్నదని పరిచారికలు చెప్పిన మాటలు విని, తామెప్పుడు కుమార్తెను చూడగలమా అని రాజదంపతులు ఎదురు చూడసాగారు. ఇరవై రోజులు గడిచాయి.

ఆ రోజు సాయంకాలం రాజదర్శనం కోసం, ప్రధానజ్యోతిషాచార్యుడువాచస్పతి వచ్చాడని భటులు తెలియజేయగానే, రాజు ఆయనకు ఎదురువెళ్ళి, గౌరవంగా తీసుకువచ్చి, ఉచితాసనంలో కూర్చోబెట్టాడు. విచార వదనులై వున్న రాజదంపతులను చూసి, జ్యోతిషాచార్యుడు చిన్నగా నవ్వుతూ, "మహారాజా! మీరు రేపే వెళ్ళి, యువరాణిని చూసి రావచ్చు. మధ్యాహ్నం తరవాత ఎప్పుడయినా వెళ్ళవచ్చు. అయితే, సూర్యాస్తమయం అయ్యేలోగా తిరిగి వచ్చేయాలి!" అన్నాడు.

"విద్యావతిని చూసి మూడు వారాలయింది. ఆమెను వదిలి ఉండలేకపోతున్నాము!" అన్నది రాణి ఎంతో విచారంగా.

రాజు, "రేపు వెళుతున్నాం కదా!" అని రాణిని ఓదార్చి, వాచస్పతాచార్యుడి కేసి తిరిగి, "విద్యావతి గ్రహస్థితిలో ఏదైనా మార్పు వచ్చిందా? ఈ విషయంగా మీరు మీ మిత్రులు జగత్పతాచార్యులను సంప్రదించారా?" అని అడిగాడు.

"సంప్రదించాను, మహారాజా! ఆయన కూడా నా అభిప్రాయంతో ఏకీభవించాడు. మరొక నలభైరోజులపాటు విద్యావతి స్థితి, ఇలాగే వుంటుందనీ, ఆ తరవాత ఆమె మామూలు మనిషి అవుతుందనీ ఆయన


అభిప్రాయపడ్డాడు. కాబట్టి మీరేమీ విచారించనవసరం లేదు. రేపు యువరాణిని చూశారంటే మీకే నమ్మకం ఏర్పడుతుంది!'' అని చెప్పి వాచస్పత్యాచార్యుడు అక్కడినుంచి బయలుదేరాడు.


రాజదంపతులు యువరాణిని చూడడానికి ఇరవై ఒకటవ రోజు తగిన సమయం అని జ్యోతిషాచార్యుడు తెలియజేశాడు గనక, ఆ రోజు, యువరాణి మధ్యాహ్నం భోజనం చేసి, విశ్రాంతి తీసుకున్న తరవాత ఆమెను చూడడం ఉచితమని రాజదంపతులు భావించారు.

యువరాణిని చూడడానికి రాజూ, రాణీ వెళుతున్నారని తెలియగానే, ప్రజలు రాజవీధికి ఇరువైపులా దారిపొడవునా బారులుతీరి నిలబడ్డారు. రాజు తమను సమీపించగానే, కొందరు యువరాణి ప్రస్తుత ఆరోగ్యపరిస్థితిని గురించి అడిగారు. యువరాణి త్వరగా కోలుకుంటున్నదని రాజు వారికి మందహాసంతో చెబుతూ ముందుకు నడిచాడు. ప్రజలెంతగానో సంతోషించారు.

సారససరోవరం వద్ద కాచుకుని వున్న పడవవాడు, రాజుకూ, రాణికీ నమస్కరించాడు. రాజదంపతులు మాత్రం పడవలోకి ఎక్కి కూర్చున్నారు. అంగరక్షకులు సైతం ఇవతలి గట్టుమీదే నిలిచిపోయారు. పడవ దీవికేసి కదిలింది.

దీవిలోని విడిది భవనం మెట్లవద్ద నిలబడిన వృద్ధపరిచారిక కమల రాజ





దంపతులకు నమస్కరించి, వారిని యువరాణి వున్న విశాలమైన గదిలోకి తీసుకు వెళ్ళింది. అప్పుడే నిద్రలేచి, కూర్చున్న యువరాణి విద్యావతి, తల్లిదండ్రులను చూడగానే నవ్వుతూ లేచి నిలబడి ఎదురు వచ్చింది. రాణి, ''బావున్నావా, తల్లీ!'' అంటూ ఆమెను ప్రేమతో కౌగలించుకున్నది. తమ కుమార్తె ముఖంలో నవ్వు చూసి రాజదంపతులు పరమానందం చెందారు. కొంత సేపయ్యాక, మహారాణి, విద్యావతి చేయి పట్టుకుని, ఆమెను పక్కనే వున్న ఉద్యాన వనానికి మెల్లగా నడిపించింది. అక్కడ కూర్చుని ముగ్గురూ మరికొంత సేపు మాట్లాడుకుని, సూర్యాస్తమయ సమయానికి రాజదంపతులు, తిరుగుప్రయాణమయ్యారు. పరిచారిక కమల వారివెంట పడవవరకు వచ్చి, నమస్కరించి విడిది భవనానికి తిరిగి వెళ్ళింది.

మరొక మూడు వారాలు గడిచాక, జ్యోతిషాచార్యుడి సలహా ప్రకారం, రాజదంపతులు యువరాణిని చూడడానికి వెళ్ళారు. అప్పుడు, యువరాణి విద్యావతి స్వయంగా పడవ వద్దకు వచ్చి, తల్లిదండ్రులకు నమస్కరించి, ప్రేమతో ఆహ్వానించింది. విద్యావతి ఇప్పుడు దాదాపు సంపూర్ణ ఆరోగ్యంతో కనిపించడం వల్ల, తల్లిదండ్రులు ఆమె దగ్గర ఆరోగ్యం గురించి ప్రస్తావించలేదు. కుమార్తెతో చాలా సేపు సంతోషంగా గడిపి, చీకటి పడుతూన్న సమయంలో వాళ్ళు పడవలో తిరుగు ప్రయాణమయ్యారు.

ఒకవైపు, కుమార్తె మామూలు మనిషి అయిందన్న సంతోషంగా వున్నప్పటికీ, మరొకవైపు కుమార్తెను వదిలి ఇంకా దాదాపు పది నెలలు గడపాలన్న విచారంతో రాజదంపతులు రాజభవనం చేరారు.


ఆ తరవాత మరొక మూడు వారాలు భారంగా గడిచాయి. అయినా, జ్యోతిషాచార్యుడి నుంచి ఎలాంటి వర్తమానమూ రాలేదు. కారణం ఏమై వుంటుందా అని


రాజదంపతులు ఆలోచించ సాగారు. ఒక నాడు రాణి రాజుతో, ''ప్రభూ! జ్యోతిషా చార్యులను తీసుకురమ్మని, భటులను పంపుదామా?'' అని అడిగింది.

''వద్దు దేవీ, ఇది పూర్తిగా జ్యోతిషా చార్యుల నిర్ణయానుసారం జరగవలసిన వ్యవహారం. ఇందులో మన జోక్యం పనికి రాదు. మన కుమార్తె క్షేమం కోసం, మనం తపస్సు లాంటి నియమాలను అనుసరిస్తున్నామన్న సంగతి మరిచి పోయావా? పైగా మన కుమార్తె క్షేమంగా ఉన్నదనే కదా పరిచారికలు చెబు తున్నారు. కాబట్టి మరి రెండు రోజులు ఓపికపడదాం!'' అని రాణిని ఓదార్చాడు రాజు.

అయితే, ఆ రోజు సాయంకాలమే జ్యోతిషాచార్యుడు వాచస్పతి, మిత్రుడు జగత్పతాచార్యుడితో పాటు రాజభవనానికి వచ్చాడు. వారిని చూడగానే రాజు గౌర వంగా లేచి నిలబడి, ఆహ్వానించాడు. ఇరువురూ ఉచితాసనాలలో కూర్చున్నారు. అప్పుడు, వాచస్పతాచార్యుడు, ''రాజా! మీరు రేపు వేకువ జామునే వెళ్ళి మీ కుమార్తెను చూసి రావాలి,'' అన్నాడు.

జ్యోతిషాచార్యుల మాటలలోని తొందర పాటుకు కారణం ఏమైవుంటుందా అని రాజు ఆలోచించసాగాడు. అంతలో జగత్పతాచార్యుడు, ''రేపు సూర్యోదయం లోగా మీరు యువరాణిని తప్పక చూడాలి. ఆ తరవాత మరొక తొంభై రోజులవరకు శుభ





ఘడియలు లేవు. అంతేకాదు; యువరాణికి కూడా రానున్న మూడు నెలలలో చాలా క్లిష్టదశ సంప్రాప్త మవుతుంది. ఆ సమయంలో ఆమె ఆరోగ్యానికి ఎటువంటి భంగమూ వాటిల్లదు. కాని....'' అంటూ ఆగిపోయాడు.

అయితే, రేపు వేకువజామున బయలుదేరి వెళ్ళి కుమార్తెను చూడాలన్న ఆలోచనతో రాజు, జగత్పతాచార్యుడు అసంపూర్తిగాచెప్పినమిగతామాటలను పట్టించుకోలేదు. జ్యోతిషాచార్యులిరువురూ వెళ్ళిపోయాక రాణికి ఈ విషయం తెలియజేయడానికి రాజు అంతఃపురంలోకి వెళ్ళి 'ఆమెతో, ''దేవీ, ఇప్పుడే వాచస్పతాచార్యులు జగత్పతాచార్యులతో సహా వచ్చి, మనం రేపు వేకువజామునే వెళ్ళి మన కుమార్తెను చూసిరావాలని సెలవిచ్చారు!'' అన్నాడు.

''అలాగా! సూర్యోదయమయాక వెళ్ళవచ్చు కదా?'' అని అడిగింది రాణి.

''సాధ్యపడదు. ఇంకొక రెండు, మూడు నెలలు విద్యావతి కేదో క్లిష్టదశ సంప్రాప్త మవుతుందనీ, రేపు తెల్లవారేలోగా ఆమెను మనం చూసి రావాలనీ జ్యోతిషాచార్యులు చెప్పారు!'' అన్నాడు రాజు.

''క్లిష్టదశ అంటే ఏమిటో వివరంగా సెలవిచ్చారా, ప్రభూ!'' అని అడిగింది రాణి విచారంగా.

''లేదు. మొదట మనం రేపు ఉదయం వెళ్ళి, విద్యావతిని చూసివద్దాం. ఆ తరవాత జ్యోతిషాచార్యులను పిలిపించి, ఆ విషయం గురించిన వివరాలు అడుగుదాం,'' అన్నాడు రాజు.

మరునాడు వేకువజామున ఎటువంటి హెచ్చరికా చేయకుండా వచ్చిన రాజదంపతులను చూసి పడవవాడు అమితాశ్చర్యం చెందాడు. రాజదంపతులు పడవలో వెళ్ళి, దీవిలోని విడిదిభవనం చేరేసరికి తూరుపుదిశలో వెలుగురేఖలు కనిపిస్తున్నాయి. రాజదంపతులను ఆహ్వానించడానికి పరిచారిక కమలగాని, యువ



రాణి విద్యావతి గాని రాలేదు. తాము వస్తూన్న సంగతి వాళ్ళకు తెలియదు కాబట్టి, రాలేదనుకుంటూ రాజదంపతులు మెట్లెక్కి భవనంలో అడుగు పెట్టారు.

అంతలో విచారవదనంతో కంగారు పడుతూ, వారికి ఎదురువచ్చిన పరిచారిక కమల, "ఈ సంగతి, అప్పుడే మీకు తెలిసి పోయిందా, ప్రభూ!" అని అడిగింది.

"ఏ సంగతి? ఏం జరిగింది? విద్యావతి ఎక్కడ?" అని అడిగారు రాణీ, రాజూ ఒక్కసారిగా.

"యువరాణిగారు. యువరాణిగారు.... మహారాణీ, యువరాణిగారు కనిపించడం లేదు!" అన్నది పరిచారిక భయం భయంగా.

"కనిపించడం లేదా? విద్యావతి ఎక్కడికి వెళ్ళింది? భవనమంతా వెతికి చూశావా?" అని అడిగాడు రాజు.

మహారాణి నోట మాటరాలేదు.


"ప్రభూ, నా జీవితంలో ఇంతకు ముందెప్పుడూ ఇలా జరగలేదు. రాత్రంతా స్పృహ కోల్పోయినట్టు నిద్రపోయానేమో, లేచేప్పుడు తల భారంగా, మత్తుగా తోచింది. యువరాణిని నిద్రలేపడానికి ఆమె శయనగృహంలోకి వెళ్ళాను. ఆమె కనిపించలేదు. ముందుగానే లేచారేమో అనుకుని మిగతా గదులలో చూశాను. అక్కడా లేదు. ఉద్యానవనంలోనూ వెతికాను, చుట్టుపక్కల తిరిగి వెతికాను, కాని యువరాణిగారి జాడ తెలియడం లేదు," అన్నది పరిచారిక, కన్నీళ్ళతో.

"ఆమె ఎక్కడికి వెళ్ళివుంటుంది?" అంటూ రాణి విద్యావతి శయన గృహం లోకి వెళ్ళి చూసి వచ్చింది.

రాజు మిగతా గదులన్నిటినీ తిరిగి చూశాడు. "విద్యావతీ! విద్యావతీ!" అని పిలుస్తూ రాణి చుట్టుపక్కల కలయ తిరిగింది. ముగ్గురూ పరిసరాలన్నీ వెదికారు. కాని యువరాణి జాడ కనిపించలేదు!

సేనానాయకుణ్ణి పిలుచుకుని రమ్మని రాజు, దూరంగా నిలబడిన పడవవాణ్ణి, ఆజ్ఞాపించాడు. —(ఇంకావుంది)





# మాయా భవనం

3

[హఠాత్తుగా అంతుబట్టని బలహీనతకు లోనైన వీరగిరి యువరాణి విద్యావతిని రాజధానికి సమీపంలో వున్న సరోవర విడిది భవనానికి తరలించారు. జ్యోతిషాచార్యుడి సలహా ప్రకారం రాజదంపతులు రెండుసార్లు వెళ్ళి కుమార్తెను చూసి వచ్చారు. మూడవసారి వెళ్ళినప్పుడు అక్కడ యువరాణి కనిపించలేదు. ఆమె కనిపించకుండా పోవడానికి ముందు ...]


అర్ధరాత్రి సమయంలో ఉలిక్కిపడి లేచింది యువరాణి విద్యావతి.

"యువరాణీ, లేవండి. వెంటనే మనం రాజప్రాసాదం చేరుకోవాలి!" అంటూ వృద్ధపరిచారిక కమల, పక్కన నిలబడి, తట్టిలేపసాగింది.

"ఈ అపరాత్రివేళా? ఎందుకూ? ఇప్పుడేమయింది?" అని అడిగింది విద్యావతి అనుమానంగా.

"మహారాజుగారు హఠాత్తుగా అస్వస్థతకు లోనయ్యారట. తమర్ని చూడాలని కలవరిస్తున్నారట. మనల్ని తీసుకు వెళ్ళడానికి పడవ వాడు వచ్చాడు," అన్నది కమల ఎంతో విచారంగా.

జుట్టు చిందరవందరగా ముందుకు విరబోసుకుని వుండడంవల్ల, మసక చీకటిలో ఆమె ముఖం విద్యావతికి స్పష్టంగా కనిపించడం లేదు.



''ఈ విడిదిభవనం నుంచి కదలకూడదని జ్యోతిష్కులు చెప్పారు కదా?'' అని అడిగింది విద్యావతి.

''నిజమే! రాజుగారూ, రాణిగారూ ఈరోజు ఇక్కడికి రావాలనుకున్నారట. కాని రాజుగారు హఠాత్తుగా అనారోగ్యం పాలవడంతో, మిమ్మల్నే రాజప్రాసాదానికి రమ్మని ఆజ్ఞాపించారు. రాజదంపతుల కోరిక మేరకే మనం అక్కడికి వెళుతున్నాము. రేపే మనం ఇక్కడికి తిరిగి రాగలం!'' అన్నది కమల.

విద్యావతి పడకపై నుంచి లేచింది. ఇరువురూ భవనం నుంచి వెలుపలికి వచ్చి పడవను సమీపించారు. ఆకాశమంతా మేఘాలు నిండివుండడం వల్ల వెన్నెల మసకమసకగా వున్నది. అందువల్ల, భవనం నుంచి మామూలు మార్గంలో కాకుండా వేరొక దారిలో నడుస్తూన్న విషయం యువరాణి గ్రహించలేకపోయింది. కమల ఆమెకన్నా ముందు కొంతదూరంలో గబగబా నడిచి పడవలోకి చేరి, యువరాణికి చేయి అందించింది. యువరాణి పడవలో కూర్చోగానే, పడవ తీరం నుంచి బయలుదేరింది.

యువరాణి నిద్రమత్తుతో పడవలో ఒక మూలగా కూర్చున్నది. కమల ఆమె పక్కనే కూర్చున్నది గాని, ఏమీ మాట్లాడలేదు. యువరాణి కూడా తన తండ్రి ఆరోగ్యం హఠాత్తుగా ఎందుకు చెడిందో, ఇప్పుడెలా ఉన్నదో అన్న విచారంతో వుండడం వల్ల, పడవ అవతలి తీరం చేరడానికి మామూలుకన్నా మరింత ఎక్కువ సమయం పట్టిందన్న విషయం కూడా గమనించలేదు. ఆవలి తీరంలో, మేనా బోయీలతో సిద్ధంగా ఉన్నది. యువరాణి మేనాలోకి చేరగానే, నలుగురు బోయీలు దానిని మోసుకుంటూ వేగంగా నడవసాగారు.

పరిచారిక కమల మేనా వెంట నడిచి వస్తున్నదని భావించిన యువరాణి కొంత సేపటికల్లా అలాగే నిద్రపోయింది.

మేనా హఠాత్తుగా ఒక వైపుకు వాలడంతో, యువరాణి మేల్కొన్నది. రాజప్రాసాదానికి వెళ్ళే మార్గంలో ఎలాంటి ఎత్తు పల్లాలూ లేవు. మరి మేనా ఎందుకు ఇలా వాలుగా వెళుతుందన్న అనుమానంతో యువరాణి, మేనా తెరను పక్కకు తొలగించి, వెలుపలికి తొంగి చూసింది. చుట్టూ అరణ్యం! బోయీలు మేనాను ఒక కొండ మీదికి మోసుకు వెళుతున్నారు! ఆమె మేనాకు ముందూ, వెనకా, ఇరువైపులా పరిశీలించి చూసింది. పరిచారిక కమల జాడ కనిపించలేదు. తను రాజప్రాసాదానికి వెళ్ళడం లేదని యువరాణి గ్రహించింది. మరి ఎక్కడికి తీసుకు వెళుతున్నారు? అది అరణ్యమధ్యంలో, అర్ధరాత్రి సమయం కాబట్టి, ఆమె బోయీలను ఆపి సంగతి అడగదలుచుకోలేదు. కొంత సేపటికి బోయీలు, మేనాను కిందికి దించారు.

"యువరాణీ, ఇక మీరు వెలుపలికి రండి!" అని ఒకస్త్రీ కంఠస్వరం వినిపించింది.

విద్యావతి మేనా నుంచి వెలుపలికి వచ్చి, చుట్టుపక్కల కలయజూసింది. చుట్టూ అరణ్యం; ఎదురుగుండా బ్రహ్మాండమైన భవనం! రూపురేఖలలో, వేషధారణలో అచ్చంగా తన పరిచారిక కమలలా



వున్న స్త్రీ పక్కన కనిపించింది. ఆమె, సరోవర విడిది భవనం నుంచి తన వెంట వచ్చిన స్త్రీ అని యువరాణి గ్రహించింది. ఆమె చూడడానికి కమల లాగే వున్నది గాని, కంఠస్వరంలో మాత్రం కొద్దిగా తేడా కనిపించింది.

"యువరాణీ, రండి....ఇక మీదట మీకు ఈ భవనమే నివాసస్థానం!" అన్నదా స్త్రీ.

"ఇప్పుడు మనం ఎక్కడున్నాం?" అని అడిగింది యువరాణి.

ఆ స్త్రీ మాట్లాడలేదు.

"అసలు నువ్వెవరు? ఇక్కడికి నన్నెందుకు ఇలా రహస్యంగా తీసుకు



వచ్చావు? మా తండ్రి అనారోగ్యం పాలయ్యారనీ, వెంటనే నన్ను చూడాలంటున్నారనీ చెప్పావు కదా? మరి ఇప్పుడు ఆయన ఎక్కడ? ఈ భవనాన్ని నేను ఇంతకు ముందెన్నడూ చూడలేదే! ఇది ఎవరిది? అసలు నన్నెందుకు ఇక్కడికి తీసుకువచ్చావు?'' అని అడిగింది యువరాణి.

''యువరాణీ, ఆగ్రహించకండి. మీ ప్రశ్నలన్నిటికీ ఇప్పుడు సమాధానం చెప్పలేనుగాని, ఒక్క విషయం మాత్రం చెబుతాను. ఈ బ్రహ్మాండమైన భవనం పేరు 'మాయా భవనం'. ప్రస్తుతానికి మీరు ఆమాత్రం తెలుసుకుంటే చాలు. మరొక్క ముఖ్య విషయం. మీకు ఈ భవనంలో ఎవరి నుంచి గాని ఎటువంటి ఆపదా రాదు. మిమ్మల్ని క్షేమంగా చూసుకునే బాధ్యత నాది. మీకు ఎటువంటి కొరతా లేకుండా చూసుకుంటాం. అంత వరకు....'' అని ఏదో చెప్పబోయి ఆగిపోయిందా స్త్రీ.


''ఎంత వరకు? ఇంతకూ నువ్వెవరో చెప్పనే లేదు!'' అని ప్రశ్నించింది యువరాణి.

''మీరు నన్ను మీ పరిచారిక పేరుతో 'కమలా' అనే పిలవవచ్చు.'' అని ఆమె కొంతసేపు ఆగి, ''మా యజమాని ఉండాలని అనుకున్నంతకాలం మీరిక్కడే వుంటారు!'' అన్నది.

''ఎవరు మీ యజమాని?'' అని గద్దించి అడిగింది యువరాణి.

''ఆ విషయం మీకు క్రమంగా దానంతట అదే తెలుస్తుంది. ఇప్పుడు నామాట విని లోపలికి వెళదాం రండి. విడిది భవనంలో మీకు నిద్రాభంగమయింది కాబట్టి, మీరు వెంటనే తిరిగి నిద్రపోవడం అవసరం,'' అన్నదా స్త్రీ దృఢమైన కంఠస్వరంతో.

ఆ తరవాత ఆమె దూరంగా నిలబడిన బోయీలకేసి తిరిగి, ''ఇక మీరు వెళ్ళవచ్చు!'' అన్నది.





వాళ్ళు ఆమెకు వంగి నమస్కరించి, అక్కడినుంచి వెళ్ళిపోయారు.

ఆ తరవాత ఆమె విద్యావతిని తన వెంట రమ్మని చకచకా భవనం మెట్లెక్క సాగింది. విద్యావతి ఆమెను అనుసరించింది. ఆ మాయాభవనం అత్యంత సుందరంగా ఉన్నది. విశాలమైన గదుల గోడలకూ, స్తంభాలకూ అందమైన అద్దాలు అమర్చబడి ఉన్నాయి. తిరిగిన చోటల్లా విద్యావతి ప్రతిబింబాలు కనిపించాయి. ఆ స్త్రీ, విద్యావతి, భవనం ముందున్న విశాల మంటపాన్ని దాటి, భవనం చివర వున్న మెట్ల దగ్గిరకి చేరారు. అక్కడినుంచి వాళ్ళిరువురూ మెట్లెక్కి, భవనం పైభాగంలోని విశాలమైన గదిలోకి అడుగుపెట్టారు. ఆ గది మనోహరమైన మణి మాణిక్యాలతో, పుష్పాలతో అందంగా అలంకరించబడి ఉన్నది. అక్కడి ప్రతి వస్తువూ వింత కాంతులతో మెరుస్తున్నది. ఎటు చూసినా అద్దాలు అమర్చబడి ఉన్నాయి!

ఆ విశాలమైన గదిలో ఒకవైపున వున్న పట్టుపాన్పును చూపి, "యువరాణీ! మీరిక్కడ హాయిగా నిద్రపోవచ్చు. నేను వచ్చి లేపేవరకు లేవనవసరం లేదు!" అన్నది ఆ స్త్రీ అధికారం ధ్వనించే కంఠస్వరంతో.

విద్యావతి ఆమె చెప్పినదానికి కాదనడం ఇష్టంలేక, మౌనంగా పాన్పుమీదికి చేరి మేను వాల్చి, కళ్ళు మూసుకున్నది. ఆ స్త్రీ తననెందుకు ఇక్కడికి తీసుకు వచ్చింది? ఇప్పుడు తండ్రి ఆరోగ్యం ఎలా ఉన్నదో? తను కనిపించకపోతే తల్లి దండ్రులెలా తల్లడిల్లిపోతారో కదా! వృద్ధ పరిచారిక కమల సరోవర విడిది భవనంలోనే వుండిపోయిందా? భగవంతుడా, ఆమెకెలాంటి ఆపదా రాకుండా కాపాడు! మాయాభవనంలో తనకు మునుముందు ఎలాంటి అనుభవాలు కలుగనున్నాయో కదా! అని ఆమె రకరకాలుగా ఆలోచించ సాగింది!

* * *

సేనానాయకుడు ఉగ్రసేనుడు మహారాణి వజ్రేశ్వరీదేవి సహోదరుడు. పడవవాడు వెళ్ళి రాజు రమ్మన్నారని చెప్పగానే, ఉగ్రసేనుడు హుటాహుటిని బయలుదేరి విడిది భవనాన్ని చేరాడు. రాజు సంగతి చెప్పాడు. సేనానాయకుడు పడవవాణ్ణి చూశాడు.


వాడు చేతులు జోడించి, ''నిన్న మధ్యాన్నం పరిచారిక లిద్దరినీ సరోవరం దాటించి అక్కడే వుండిపోయాను, ప్రభూ! ఆ తరవాత అక్కడినుంచి కదల లేదు. రాత్రి కూడా అదే పడవలోనే ఎప్పటిలా పడుకుని నిద్రపోయాను. యువరాణిగారి సంగతి నాకేమీ తెలియదు, ప్రభూ!'' అన్నాడు.

ఉగ్రసేనుడు మౌనంగా కొంతసేపు ఆలోచించి, రాజుతో, ''ప్రభూ! దీవికి దరిదాపులలో ఇది తప్ప మరొక పడవ లేదు. కాబట్టి యువరాణి పడవలో వెళ్ళి వుండే అవకాశంలేదు. సరోవరం అవతలి గట్టు చాలా దూరంలో ఉన్నది; కొన్నిచోట్ల మరీ లోతుగానూ ఉన్నది. కాబట్టి ఆమె ఈదుకుంటూ వెళ్ళడానికి సాధ్యం కాదు. పైగా ఆమెకు అలా వెళ్ళవలసిన అవసరం కూడా లేదు. కాబట్టి ఎవరో దొంగచాటుగా విడిదిభవనంలోకి ప్రవేశించి, యువరాణిని మంచి మాటలతో వంచించి గానీ, బలవంతంగా గానీ, తీసుకుని వెళ్ళి వుండాలి. అంటే విద్యావతిని ఎవరో అపహరించుకుని వెళ్ళారు!'' అన్నాడు.

రాజు మౌనంగా తల పంకించాడు.

పరిచారిక కమలను మాత్రం విడిది భవనంలోనే వుంచి, రాజూ, రాణీ, ఉగ్రసేనుడూ పడవలోకి వచ్చి కూర్చున్నారు. పడవ ముందుకు కదిలింది. విద్యావతి ఏమై వుంటుంది? ఎక్కడికి వెళ్ళి వుంటుంది? ఆమెను ఎవరు అపహరించి వుంటారు? ఆమె ఆచూకీ తెలుసుకొని ఆమెను రక్షించడం ఎలా? అని తీవ్రంగా ఆలోచిస్తూ ముగ్గురూ రాజభవనం చేరారు. —(ఇంకా వుంది)






4


[జ్యోతిషాచార్యుడి సలహా ప్రకారం, వీరసేన మహారాజు, మహారాణితో కలిసి, సరోవర విడిది భవనంలో విశ్రాంతి తీసుకుంటున్న కుమార్తె విద్యావతిని చూడడానికి మూడవసారి వెళ్ళినప్పుడు అక్కడ ఆమె కనిపించలేదు. ఆమె జాడ తెలుసుకోవడం ఎలాగా అని ఆలోచిస్తూ, మహారాజూ, మహారాణీ, సేనానాయకుడు ఉగ్రసేనుడూ రాజప్రాసాదం చేరారు. తరవాత]

వీరసేన మహారాజు సభామంటపంలో కొలువుదీరాడు. మంత్రులూ, సేనానాయకులూ, దండనాయకులూ, సలహాదారులూ, అందరూ సభకు హాజరయ్యారు. రాజు వారికి యువరాణి అదృశ్యమైన సంగతి క్లుప్తంగా వివరించాడు.

రాజు మాటలు వినగానే సభలో ఒక మూల గుసగుసలు ప్రారంభమయ్యాయి. రాజు అటు కేసి తిరిగి చూశాడు. అప్పుడు రాజుగారి సలహాదారుడు ఒకడు లేచి నిలబడి, ''మహాప్రభువులు మన్నించగలమంటే ఒక చిన్న విన్నపం!'' అన్నాడు.

చెప్పు అన్నట్టు రాజు తల పంకించాడు.

''యువరాణి విద్యావతీదేవిగారిని వేసవి విడిది భవనానికి తరలించినప్పుడు, దీవికి కట్టుదిట్టమైన కాపలా వుంచక పోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. యువరాణికి తోడుగా ఒక వృద్ధపరిచారికను



మాత్రం పంపడం, ఆహారపానీయాలు తీసుకువెళ్ళే పరిచారికలు సైతం వెంటనే తిరిగి రావాలని జ్యోతిషాచార్యులు నిబంధనలు విధించడం మరీ విడ్డూరంగా ఉన్నది!'' అన్నాడు ఆ సలహాదారు.

అతని మాటలు సభలో కొంత కలకలం పుట్టించాయి.

''ఈ విషయంలో వాచస్పతాచార్యులను శంకించడం భావ్యం కాదు. ఆయన రాజకుటుంబానికి అత్యంత ఆప్తులు. ఆయనపట్ల మాకు అచంచలమైన విశ్వాసం ఉన్నది. పైగా నిన్న ఆయనే స్వయంగా జగత్పతాచార్యుడితో పాటు వచ్చి, ఈ రోజు వేకువజామున వెళ్ళి యువరాణిని చూసి రమ్మని మాకు సలహా ఇచ్చారు. యువరాణికి కాస్త క్లిష్టమైన దశ ఆరంభం కానున్నదని కూడా హెచ్చరించారు. అటువంటి వారిని శంకించడం ఏమాత్రం సమంజసం కాదు!'' అన్నాడు రాజు.

సభలో ఒక్క నిమిషం నిశ్శబ్దం ఆవరించింది.

''జగత్పతాచార్యుడు ఎవరు?'' అని అడిగాడు ఉగ్రసేనుడు.

''ప్రధాన జ్యోతిషాచార్యుల మిత్రుడు. ఆయన కూడా గొప్ప జ్యోతిష్కుడు. వాచస్పతాచార్యులు ముఖ్య విషయాలలో ఆయనను సంప్రతిస్తూ వుంటారు!'' అన్నాడు రాజు.

యువరాణి అదృశ్యమైన విషయం ప్రజలకు చాటింపు వేయాలని నిర్ణయం తీసుకున్న తరవాత సభ ముగిసింది.

చాటింపు విని ప్రజలు దిగ్భ్రాంతులయ్యారు. నగర ప్రజలు అక్కడక్కడ గుంపులు గుంపులుగా చేరి పలు పలు విధాలుగా మాట్లాడుకోసాగారు.

''యువరాణిని అపహరించేటటువంటి నీచుడు, మన రాజ్యంలో వుండడు!'' అన్నది ఒక వృద్ధురాలు.

''సరోవరానికి ఆనుకుని వున్న అరణ్యంలోని కొండగుహలన్నీ, అరచేతిగీతల్లా

నాకు స్పష్టంగా తెలుసు. ఇప్పుడే నేను యువరాణిని వెదకడానికి బయలుదేరు తాను!'' అన్నాడొక యువకుడు.

ఈలోపల యువరాణి అదృశ్యమయిందన్న వార్త తెలిసిన వాచస్పతాచార్యులు రాజభవనం చేరి, రాజును, ''ప్రభూ! నేను విన్నది నిజమేనా?'' అని అడిగాడు.

''జరగవలసిందేదో జరిగిపోయింది. అయినా, ఇప్పుడు విద్యావతికి ఎటువంటి అపాయమూ రాకూడదు. అందుకు మనం చేయగలిగిందేమిటో సెలవివ్వండి. ఆమె క్షేమం కోరి, నివాసస్థానంలో మార్పును సూచించింది మీరు. అక్కడ జరగకూడనిది జరిగిపోయింది. ఆమె ఇప్పుడు ఎక్కడున్నదో కనుగొనే మార్గం కూడా మీరే చెప్పాలి!'' అన్నాడు రాజు గంభీరంగా.

''విద్యావతి చాలా సుకుమారి. ఆమె ఇప్పుడెక్కడున్నదో కదా? ఆమెకు ఎటువంటి ఆపదా రాకూడదు!'' అన్నది మహారాణి, కళ్ళనీళ్ళతో.

వాచస్పతాచార్యులు ఒక్క నిమిషం ఏమీ మాట్లాడలేక పోయాడు. ఆ తరవాత రాజదంపతులను ఓదారుస్తూ, ''విచారించకండి మహారాజా! యువరాణికి ఎటువంటి ఆపదా రాదు. పూర్ణచంద్రుడికి పట్టే గ్రహణంలాంటిదే ఇది. నేను



ఇప్పుడే వెళ్ళి, ఆమె జాతకాన్ని మరొకసారి జాగ్రత్తగా పరిశీలించి చూసి, ఆమె ఏ దిశలో వున్నదో తెలుసుకుని వచ్చి మీకు చెబుతాను!'' అని అక్కడినుంచి బయలుదేరాడు.

ఇంటికి చేరిన వాచస్పతాచార్యులు, విద్యావతి జాతకాన్ని ముందుంచుకుని దీక్షగా పరిశీలించసాగాడు. తాళపత్ర గ్రంథాలను తీసి చదవసాగాడు. ఎంతసేపటికీ జగత్పతాచార్యుడి జాడ లేదు. ఆ రోజే కాదు, మరునాడూ అతడు రాలేదు. మూడవ రోజు కూడా రాలేదు. జగత్పతి ఎక్కడికి వెళ్ళాడా అని వాచస్పతాచార్యులు ఆశ్చర్యంతో ఆలోచించ





సాగాడు. యువరాణి ఉన్నట్టుండి నీరసించి పోవడం; అందుకు తాను సూచించిన నివారణోపాయం; ఆ విషయంగా తాను జగత్పతితో చర్చించిన సంగతి— మొదలైన విషయాలు వాచస్పతి మనసులో కదలాడ సాగాయి.

జగత్పతి, రాజవంశానికి చెందినవాడు. జగత్పతి పితామహుడు కైలాసపతి— హిమగిరి రాజు త్రిలోకపతికి తమ్ముడు. వృద్ధుడైన అన్నకు సంతానం లేనందు వల్ల, ఆయన తదనంతరం తానే హిమగిరికి రాజు కాగలనని కైలాసపతి కలలు గన్నాడు. అయితే, త్రిలోకపతి మరణానంతరం, ఆయన సహోదరి కుమారుడు ఉమాపతి హిమగిరి రాజ్యాధికారాన్ని చేపట్టాడు. కైలాసపతి రాజ్యభ్రష్టుడై అరణ్యాల పాలయ్యాడు. హఠాత్తుగా తనకు కలిగిన దురదృష్టానికి కారణం అన్వేషించడంవల్ల, ఆయనకు క్రమంగా జ్యోతిషశాస్త్రంపట్ల ఆసక్తి ఏర్పడింది. దేశదేశాలలోని జ్యోతిష్కులనూ, దైవజ్ఞులనూ సందర్శిస్తూ, మానవ జీవితాలలో విధి తీసుకు వచ్చే మార్పులను గురించి తెలుసుకుంటూ కాలం వెళ్ళబుచ్చాడు. కైలాసపతి కుమారుడు గజపతి కూడా జ్యోతిషంపట్ల ఆసక్తి కనబరిచాడు. ఆయన తన కుమారుడు జగత్పతికి జ్యోతిషశాస్త్రంతో పాటు తాను పురాతన గ్రంథాలనుంచీ, ఆటవిక జాతుల ప్రజల నుంచీ నేర్చుకున్న మంత్ర తంత్రాలనూ, మాయాజాలాన్నీ నేర్పాడు.

జగత్పతి, రాజ్యభ్రష్టులయిన తన తాత తండ్రులు, అరణ్యమధ్యంలో నిర్మించుకున్న భవనాన్ని మరింత బ్రహ్మాండమైన భవనంగా పునర్నిర్మించుకున్నాడు. అక్కడ ఏకాంతంగా మంత్ర తంత్రాలలోనూ, మాయాజాల విద్యలోనూ అహర్నిశలు దీక్షతో కృషిచేస్తూ ప్రావీణ్యతను పెంపొందించుకో సాగాడు.

జగత్పతి జ్యోతిషశాస్త్రం, మంత్ర తంత్రాలతో మాత్రమే తృప్తిపడలేదు.


RAZI



కాలం కలిసి వస్తే, హిమగిరి రాజ్యానికి కాకపోయినా, మరే రాజ్యానికైనా, ఏనాటి కైనా తాను రాజ కాకపోతానా అన్న ఆశకొద్దీ రాజ్యాంగ వ్యవహారాలను కూడా అధ్యయనం చేయసాగాడు. అతడు కలలుగన్న అవకాశం ఇప్పుడు తానుగా వచ్చి తలుపు తట్టినట్టు భావించాడు జగత్పతి!

వీరగిరి రాజు ఏకైక కుమార్తె విద్యావతి సరోవర విడిదిభవనంలో ఒంటరిగా ఉన్నది. ఈ క్లిష్టదశ పూర్తయిన వెంటనే యువరాణికి వివాహయోగం ఉన్నదని వాచస్పతాచార్యులు సెల విచ్చారు. విద్యావతి వివాహం తనతో అయినట్టయితే వీరగిరి సింహాసనం తన వశమవుతుంది కదా, అన్న ఆలోచన జగత్పతిని ఒక చోట నిలబడ నివ్వలేదు. రహస్యంగా వెళ్ళి సరోవర పరిసర ప్రాంతాలను పరీక్షించి చూశాడు. పడవ రేవుకు దూరంగా చెట్ల మధ్య వున్న చిన్న మార్గాన్ని కనుగొన్నాడు. ఎవరికీ తెలియకుండా అక్కడొక పడవను కూడా ఏర్పాటు చేశాడు.

విడిది భవనంలో వున్న యువరాణిని రహస్యంగా అరణ్యమధ్యంలో వున్న మాయాభవనానికి తరలించుకుని వెళ్ళి, అక్కడే దాచి వుంచి, గ్రహస్థితి బాగుపడిన తరవాత, ఏమీ ఎరగనట్టు తనే ఆమెను తీసుకొని వెళ్ళి రాజుకు అప్పగించినట్టయితే, రాజదంపతులు పరమానందభరితులైపోతారు. కృతజ్ఞతా భావంతో వాళ్ళు యువరాణిని తనకే ఇచ్చి వివాహం జరపవచ్చు—జగత్పతి ఇలా ఆలోచించి తన పథకానికి కార్య రూపం ఇవ్వడానికి రంగంలోకి దిగాడు!

అసలు విషయం తెలియని వాచస్పతాచార్యులు, జగత్పతి కోసం ఎదురు చూశాడు. కాని, మూడు రోజులయినా జగత్పతి జాడ కనిపించలేదు. నాలుగవ రోజు వాచస్పతాచార్యులు రాజదర్శనానికి బయలుదేరాడు.



రాజభవనం చేరేసరికి అక్కడ సేనానాయకుడు ఉగ్రసేనుడు, యువరాణిని వెతకడానికి భటులను నలువైపులకూ పంపిన వివరాలను రాజుకు వివరిస్తున్నాడు. వాచస్పతిని చూడగానే రాజు, ''విద్యావతి క్షేమంగా ఉన్నది కదా?'' అని అడిగాడు.

''మహారాజా! ఈ విషయంలో మీకు అణుమాత్రం కూడా అనుమానం వద్దు. యువరాణి సురక్షితంగా ఉంటుంది. ఆమెకు ప్రాణభయం లేదు. గ్రహబలాన్నిబట్టి చూస్తే, యువరాణి ఇప్పుడు రాజధానీ నగరానికి పశ్చిమ దిశలో ఉండాలి. కాబట్టి ఆ దిశలో వెతికించడం మంచిది!'' అన్నాడు వాచస్పతాచార్యులు.

''మన రాజ్యానికి పశ్చిమంగా, కొండలూ, అడవులే కదా ఉన్నాయి! అయినా, మన సైనికులు, ఆ మహారణ్యంలో మానవమాత్రులు వెళ్ళగలిగినంత దూరం వెళ్ళి, వెతికి వచ్చారు. ఉత్తర దిశగా వెళ్ళిన సైనికులు మాత్రం ఇంకా తిరిగి రాలేదు!'' అన్నాడు ఉగ్రసేనుడు.

''వాళ్ళు రానీ, ఆ తరవాత జ్యోతిషాచార్యుల సలహా ప్రకారమే మరికొంత మంది సైనికులను మళ్ళీ దక్షిణ దిశకు పంపుదాం. అది సరేగాని, ఎవరో ఒక యువకుడు విద్యావతిని వెతకడానికి అనుమతి కోరుతున్నట్టు చెప్పావు. ఎక్కడా యువకుడు? సైనికులను తనవెంట పంపమంటున్నాడా ఏం?'' అని అడిగాడు రాజు.

''లేదు మహారాజా! అతడు విద్యావతిని వెదకడానికి ఒంటరిగానే వెళతాడట. అందులో విజయం సాధిస్తే సరేసరి. ఒకవేళ ఆ ప్రయత్నంలో తను ప్రాణాలు కోల్పోయినట్టయితే, వేరొక దిక్కులేని వృద్ధురాలయిన తన తల్లి సంరక్షణా బాధ్యతలు మనమే స్వీకరించాలని ప్రార్థిస్తున్నాడు. ఆ యువకుణ్ణి

చూస్తూంటే సామాన్యుడిలా కనిపించడం లేదు. అతనికి ఒక అవకాశం ఇవ్వడం మంచిదనుకుంటాను. అందులో అతడు విజయం సాధించినా ఆశ్చర్యం లేదు!'' అన్నాడు ఉగ్రసేనుడు.

''అలాగా? ఎక్కడా యువకుడు?'' అని అడిగాడు రాజు.

''కోట గుమ్మం ముందే ఉన్నాడు. పిలిపించమంటారా?'' అని అడిగాడు ఉగ్రసేనుడు.

''తీసుకు రమ్మను,'' అన్నాడు రాజు.


ఆ యువకుణ్ణి లోపలికి తీసుకు రమ్మని, అక్కడ నిలబడిన ఒక భటుణ్ణి ఆజ్ఞాపించి, ఉగ్రసేనుడు, వాచస్పతాచార్యులకేసి తిరిగి, ''మీరీ మధ్య జగత్పతాచార్యులను చూశారా?'' అని అడిగాడు.

''లేదు! ఆయన నా దగ్గిరికి వచ్చి నాలుగు రోజులయింది. రోజూ వచ్చేవాడు; ఇప్పుడు రాకపోవడం ఆశ్చర్యంగా ఉన్నది. మరేదైనా కార్యంమీద వేరెక్కడికయినా వెళ్ళాడేమో! ఆయన రాగానే మీ దగ్గిరికి పంపమంటారా?'' అని అడిగాడు వాచస్పతాచార్యులు.

''వద్దు. నాలుగు రోజుల క్రితం, మీతో పాటు జగత్పతాచార్యులు కూడా రాజదర్శనానికి వచ్చాడని రాజుగారు చెప్పారు. ఇప్పుడు విద్యావతి గురించి ఆయన ఏమైనా చెప్పారేమో తెలుసుకుందామని అడిగాను. అంతే!'' అన్నాడు ఉగ్రసేనుడు.

వాచస్పతాచార్యులు, లేచి నిలబడి రాజుకు నమస్కరించి బయలుదేరబోయాడు. అంతలో భటుడు ఒక యువకుణ్ణి అక్కడికి తీసుకు వచ్చాడు. అందమైన ఆ యువకుడి చురుకైన కళ్ళలోకి చూసి, జ్యోతిషాచార్యులు ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు. యువరాణిని వెతికేందుకు, ఒంటరిగా వెళ్ళడానికి సాహసించిన ఆ యువకుడు ఎవరై ఉంటాడా అని ఆలోచిస్తూ, ఆయన రాజప్రాసాధం వెలుపలికి వచ్చాడు. —(ఇంకా వుంది)





# మాయా భవనం

## 5

[సారససరోవర విడిదిభవనం నుంచి హఠాత్తుగా కనిపించకుండా పోయిన వీరగిరి యువరాణి విద్యావతిని వెతకడానికి, మహారాజు వీరసేనుడి అజ్ఞానుసారం సేనాధిపతి ఉగ్రసేనుడు, భటులను నలుదిశలకూ పంపాడు. మరునాడు యువరాణిని వెతకడానికి రాజుగారి అనుమతిని వేడుతూ ఒక యువకుడు రాజదర్శనం కోసం వచ్చాడు. —తరవాత ]

భవనం లోపలికి భటుడు తీసుకువచ్చిన యువకుడు రాజును చూడగానే చేతులు జోడించి గౌరవంగా నమస్కరించాడు. రాజు ఆ యువకుణ్ణి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు. ఆ యువకుడి వేష ధారణ సాధారణంగా ఉన్నప్పటికీ, అతని చూపులలో అసాధారణమైన రాచ ఠీవి, గాంభీర్యం స్పష్టంగా కనిపించాయి. ఆ యువకుణ్ణి గురించి, అంతకు ముందు సేనాధిపతి చెప్పిన మాటలలో ఎంతో నిజముందని రాజు గ్రహించాడు.

అంతలో సేనాధిపతి, ''ఈ యువకుడే మన యువరాణిని వెతికి తీసుకురావడానికి అనుమతి కోరివచ్చాడు,'' అన్నాడు.

రాజు ఆ యువకుడితో, ''నీ పేరేమిటి? నువ్వెవరు ? మా సైనికులు నలుదిశలకూ వెళ్ళి యువరాణిని వెతికి వచ్చారు. మరికొందరు పొరుగు రాజ్యా



లకు కూడా వెళ్ళి ఉన్నారు. నువ్వు ఒంటరిగా యువరాణిని వెతకడానికి వెళతానంటున్నావు. అది నీ ఒక్కడివల్ల సాధ్యమయ్యే పనేనా ? ఒకవేళ యువరాణిని చూసినా నువ్వు గుర్తుపట్టగలవా ?'' అని అడిగాడు.

ఆ యువకుడు చేతులు జోడించి, ''మహారాజా! యేటా యువరాణి జన్మదిన సందర్భంగా జరిగే ఊరేగింపును నేనూ, మా తల్లీ చూసేవాళ్ళం. అందువల్ల నేను యువరాణిగారిని సులభంగా గుర్తించగలను,'' అన్నాడు.

''ఇంతకూ, నువ్వు ఎవరన్న సంగతి చెప్పనేలేదు!'' అన్నాడు రాజు.

''మహారాజా! నా పేరు మహేంద్రనాథుడు. రాజధానీ నగరానికి కొద్ది దూరంలో ఉన్న దేవీ ఆలయ సమీపంలో నేనూ, మా తల్లీ ఉంటున్నాము. మా తల్లి, రోజూ పూలు కోసి, మాలకట్టి దేవీ ఆలయానికి సమర్పిస్తూ వుంటుంది. నా మూడేళ్ళ వయసులో మా తండ్రి మరణించాడు. అప్పటినుంచి, మా ఆలనా పాలనా మా పినతండ్రిగారే చూసేవారు. అయినా, మా పినతల్లి హఠాత్తుగా చనిపోవడంతో, మా పినతండ్రికి జీవితం మీద విరక్తి పుట్టి, మమ్మల్నందరినీ వదిలి ఎటో వెళ్ళిపోయాడు. నాకు ఊహ తెలిసిన రోజునుంచి నా సంపాదనతోనే నేనూ, మా తల్లీ జీవిస్తున్నాము,'' అన్నాడా యువకుడు వినయంగా.

రాజు తల పంకించి, ''అయినా, నువ్వు తలపెట్టిన కార్యం సులభమైనది కాదు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కోవలసి వుంటుంది.'' అన్నాడు.

''నిజమే, మహారాజా! అవన్నీ బాగా ఆలోచించుకునే వచ్చాను. నేను యువరాణిగారిని వెతుకుతూ వెళితే, తిరిగి రావడానికి కొన్ని రోజులు పట్టవచ్చు. అక్కడ ఎదురయ్యే కష్టనష్టాల గురించి నాకు భయంలేదు. అయితే, అంతవరకు ఇక్కడ నా తల్లి సంరక్షణాబాధ్యతలు



చూసుకోవడానికి నేను తప్ప మరొక దిక్కు లేదు. అందుకే ఈ విషయాన్ని సేనాధిపతికి ముందే తెలియజేశాను,'' అన్నాడు మహేంద్రనాధుడు.

''అవును, సేనాధిపతి ఆ విషయం నాకు ముందే చెప్పాడు. ఆ సంగతి మేము చూసుకుంటాము. నువ్వు ఈ కార్యంలో విజయం సాధించావంటే నిన్ను గొప్ప బహుమతులతో సత్కరించగలము. ఇంకేదైనా కోరిక వుంటే ఇప్పుడే చెప్పు!'' అని అడిగాడు రాజు.

''ఎటువంటి బహుమతిని ఆశించిగాని నేనీ పనికి పూనుకోలేదు. ఇటువంటి క్లిష్టపరిస్థితులలో ఆదుకోవడం ప్రతి పౌరుడికీ కర్తవ్యం కదా? నాకు రాజధాని సమీప అరణ్యప్రాంత పరిసరాలు బాగా తెలుసు. అందుకే యువరాణిని వెదకడానికి మీ అనుమతి కోసం వచ్చాను,'' అన్నాడు మహేంద్రనాధుడు.

''అలాగే, నీ కోరికను అంగీకరిస్తున్నాను. ఎప్పుడు బయలుదేరుతావు?'' అని అడిగాడు రాజు.

''రేపే బయలుదేరతాను, మహారాజా! అయితే,'' అని ఆగాడు మహేంద్రనాధుడు.

''ఏమిటి?'' అన్నాడు రాజు.

ఉగ్రసేనుడు కూడా ఏమిటి అన్నట్టు మహేంద్రనాధుడికేసి చూశాడు.

''మహారాజా! నేనైతే యువరాణి గారిని గుర్తుపట్టగలను. అయితే, మీ అనుమతితోనే, నేను యువరాణిని వెతకడానికి వెళ్ళానని ఆమెకు తెలియజేయడం ఎలాగా అని ఆలోచిస్తున్నాను,'' అన్నాడు మహేంద్రనాధుడు.

''మహారాజా! యువరాణికి ఆనవాలుగా ఏదైనా ఇచ్చి పంపడం అంత క్షేమం కాదు. ఎందుకంటే అది మార్గమధ్యంలో కనిపించకుండా పోవచ్చు; దానిని ఎవరైనా దొంగిలించవచ్చు,'' అన్నాడు ఉగ్రసేనుడు.

రాజు ఉగ్రసేనుడితో, ''నిజమే. నాకూ అలాగే అనిపిస్తున్నది,'' అని, మహేంద్ర



నాధుడికేసి తిరిగి, "యువరాణి కుడి భుజం మీద ఒక పుట్టుమచ్చ ఉన్నది. అది నాకూ, మహారాణికీ తప్ప వేరెవ్వరికీ తెలియదు. నువ్వు యువరాణిని చూసినప్పుడు ఈ మాట చెప్పావంటే, ఆమె నిన్ను మేము పంపినట్టు గుర్తించగలదు. అయితే, నువ్వీ సంగతిని మూడో మనిషికి చెప్పకూడదు జాగ్రత్త!" అని హెచ్చరించి, "మీ తల్లి సంరక్షణా బాధ్యతలు సేనాధిపతి చూసుకుంటాడు. కాబట్టి, నువ్వు రేపే నిశ్చింతగా బయలుదేరవచ్చు. యువరాణిని గురించిన శుభవార్తతో నువ్వు జయప్రదంగా తిరిగి రావాలని మేమందరం ఎదురుచూస్తూ వుంటాము," అని చెప్పి ఆసనంనుంచి లేచి, అంతఃపురంకేసి బయలుదేరాడు.

సేనానాయకుడు, "సాయంకాలం, మీ తల్లిని వెంటతీసుకుని రా. మిగతా ఏర్పాట్లగురించి మాట్లాడుదాం," అన్నాడు.

మహేంద్రనాధుడు అక్కడినుంచి ఇంటికి చేరేసరికి, అతని తల్లి సాయంకాలం పూజకు పూలమాలలు సిద్ధం చేస్తున్నది.


"అమ్మా, నేను రాజుగారిని దర్శించి వచ్చాను," అన్నాడు.


"వీరసేనమహారాజుగారినా? నిజంగానా? రాజాస్థానంలో ఉద్యోగంలో చేరావా ఏం?" అని అడిగింది తల్లి ఆనందాశ్చర్యాలతో.

"ఉద్యోగంలో తరవాత చేరుతాను. ఇప్పుడు నేను యువరాణిగారిని వెతకడానికి రాజుగారు అనుమతి ఇచ్చారు!" అన్నాడు మహేంద్రనాధుడు.

"యువరాణిని వెతకడానికి నువ్వు వెళుతున్నావా? ఆమెను ఎక్కడని వెతకగలవు? ఒంటరిగా అరణ్యంలోకి వెళ్ళడం క్షేమమవుతుందా? అయినా, నువ్వు వచ్చేవరకు ఇక్కడ నన్ను చూసుకునే వాళ్ళెవరు?" అన్నది తల్లి విచారంగా.

"విచారించవద్దు! యువరాణిగారి ఆచూకీ తెలుసుకుని నేను క్షేమంగా





తిరిగి రాగలను. అంతవరకు నీ సంరక్షణా బాధ్యతలు రాజుగారే చూసుకుంటారు. ఈ రోజు సాయంకాలం మనం సేనాధిపతిని కలుసుకున్నామంటే, నీ అనుమానాలన్నీ తీరిపోతాయి,'' అని తల్లికి ధైర్యం చెప్పి, ఓదార్చాడు మహేంద్రనాథుడు.

సాయంకాలం, కొడుకు వెంట తనను చూడడానికి వచ్చిన మహేంద్రనాథుడి తల్లితో సేనాధిపతి ఉగ్రసేనుడు సాదరంగా, ''అమ్మా, మీ కుమారుడు ఈ కార్యంలో విజయం సాధించి, రాజకుటుంబానికీ, రాజ్యప్రజలకూ ఆనందాన్ని కలిగించగలడనే అనిపిస్తున్నది. అతడు తిరిగి వచ్చే వరకు, మీ సంరక్షణ చూసుకునే బాధ్యత నాది. మీకు రాజభవనం నుంచే రోజూ మూడు పూటలూ భోజనం వస్తుంది. మీకు తోడుగానూ, మీ అవసరాలు చూడడానికి ఒక సైనికుడిభార్యను పంపుతాను. కాబట్టి మీరునిశ్చింతగా వుండవచ్చు. మీ కుమారుణ్ణి వెళ్ళిరమ్మని నిండు మనసుతో ఆశీర్వదించండి,'' అన్నాడు.

ఆ తరవాత ఉగ్రసేనుడు మహేంద్రనాథుడి కేసి తిరిగి, ''మీ తల్లిని గురించిన విచారం ఇక నీకు వద్దు. అరణ్యంలో పశ్చిమదిశ నుంచి వెతకడం ప్రారంభిస్తే మంచి ఫలితం వుంటుందని వాచస్పతాచార్యులు సెలవిచ్చారు. కాబట్టి ఆ విషయాన్ని గుర్తుంచుకో. రాజుగారు చెప్పిన విషయం కూడా మరిచిపోవద్దు. రేపు పొద్దునే బయలుదేరి క్షేమంగా వెళ్ళి, విజయం సాధించుకుని రా,'' అన్నాడు.

తల్లీకొడుకులు తృప్తిగా అక్కడి నుంచి తమ ఇంటికి బయలుదేరారు.

మరునాడు తెల్లవారుజామునే లేచి, మహేంద్రనాథుడు తల్లిపాదాలకు నమస్కరించి, ఆశీర్వాదాలు పొంది, ఆమె కట్టి ఇచ్చిన అన్నం మూటనెత్తుకుని, సరోవరంకేసి నడిచాడు.

సారస సరోవరం మధ్య వున్న విడిది భవనాన్ని అతడెన్నడూ దగ్గరనుంచి చూడ

లేదు. అతడు ఆ భవనాన్ని చూసి, ఆశ్చర్యంచెందాడు. సరోవర పరిసర ప్రాంతాలను కలయ చూశాడు. చిన్న రేవుదగ్గర ఒక పడవ కనిపించింది. పడవ సమీపంలోని చెట్టునీడలో కూర్చుని వున్న పడవవాడు, మహేంద్రనాధుణ్ణి చూడగానే, లేచి నిలబడి, చేతులు జోడించి, "బాబూ, తమరు రాజభవనం నుంచి వస్తున్నారా ?" అని అడిగాడు.

"ఎందుకు అలా అడుగుతున్నావు ?" అన్నాడు మహేంద్రనాధుడు.

"యువరాణిగారిని గురించి మంచి కబురు వస్తుందేమోనని ఎదురు చూస్తున్నాను, బాబూ. యువరాణిగారు వచ్చినా, లేదా ఫలానా చోట ఉన్నదని తెలిసినా, విడిదిభవనంలో వుండే పరిచారిక మళ్ళీ రాజభవనం చేరవచ్చు. ఆమె ఒక్కతే బిక్కుబిక్కుమంటూ విడిదిభవనంలో ఉంటున్నది. పగటి వేళ ఒకరిద్దరు పరిచారికలు వచ్చి, భోజనం ఇచ్చి వెళుతున్నారు. ఆ తరవాత ఆ ముసలిది ఒక్కతే దిగులుతో కూర్చుని ఉంటున్నది, బాబూ. అందుకే అడిగాను," అన్నాడు పడవవాడు.


"ఇంకా యువరాణిగారి జాడ తెలియ లేదు. ఆమెను వెతకడానికే నేను బయలుదేరాను," అన్నాడు మహేంద్ర నాధుడు.

"అలాగా ! చాలా సంతోషం. అయితే, ఒకటిమాత్రం నిజం. ఆ దుర్మార్గులు ఆమెను ఈ రేవుగుండా అపహరించుకుని వెళ్ళలేదు. సరోవరం నుంచి మరేదో మార్గం వుండాలి !" అన్నాడు పడవవాడు.

"ఇప్పుడు సరోవరం చుట్టూ తిరిగి, వెలుపలికి మార్గం ఏదైనా కనిపిస్తుందేమో చూస్తాను. అరణ్యంలోకి ఏదైనా మార్గం వున్నట్టు కనిపిస్తే, ఆ దారిగుండా నా ప్రయాణం సాగిస్తాను," అంటూ అక్కడి నుంచి బయలుదేరాడు మహేంద్రనాధుడు.

"మీ ప్రయాణం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. వెళ్ళిరండి !" అన్నాడు పడవవాడు. —(ఇంకావుంది)





# మాయా భవనం

## 6

[వీరగిరి యువరాణి విద్యావతిని సారససరోవర విడిదిభవనం నుంచి, ఎవరో అరణ్య మధ్యంలోని మాయాభవనానికి రహస్యంగా తరలించారు. యువరాణిని వెతకడానికి, మహేంద్ర నాధుడనే యువకుడు రాజు వీరసేనుడి అనుమతి పొంది బయలుదేరాడు. అక్కడ మాయా భవనంలో యువరాణి విద్యావతికి అంతా చాలా విచిత్రంగా కనిపించింది. —తరవాత]

మాయాభవనంలో వృద్ధ పరిచారిక కమల పోలికలతో వున్న స్త్రీ చెప్పిన విధంగా, యువరాణి విద్యావతి ఒక తల్పం మీద పడుకుని కళ్ళు మూసుకున్నది. కాని ఆమెకు ఎంతకూ నిద్ర పట్టలేదు. తన తండ్రి హఠాత్తుగా వ్యాధిగ్రస్తుడయ్యాడని తనతో చెప్పి మోసంతో తనను ఇక్కడికి తీసుకు వచ్చిన దుర్మార్గులు ఎవరై వుంటారు? తన తండ్రికి శత్రువులై వుంటారా? ప్రజలను కన్న బిడ్డల్లా పాలిస్తూ, ఇరుగు పొరుగు రాజ్యాలతో చక్కటి స్నేహసంబంధాలు కలిగి, అజాతశత్రువుగా పేరుగాంచిన తనతండ్రికి శత్రువులు ఎవరు? ఈ విపత్కర పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొని ఎలాగైనా ఈ మాయా భవనం నుంచి బయటపడి తల్లిదండ్రులను కలుసుకోవాలి, అని ఆలోచిస్తూ ఆమె తెల్లవారుజామున నిద్రపోయింది.



పరిచారిక కమల పోలికలతో వున్న వృద్ధస్త్రీ మెల్లగా తట్టి లేపడంతో యువరాణి కళ్ళు తెరిచి చుట్టుపక్కల కలయ చూసింది. గదిలోకి నీరెండ పడుతున్నది. తెల్లవారి చాలా సేపయిందని ఆమె గ్రహించింది.

''బాగా నిద్రపోయినట్టున్నావు ?'' అని అడిగింది వృద్ధస్త్రీ.

అవును అన్నట్టు తల ఊపి, లేచి కూర్చుంటూ, ''స్నానం చేయాలి,'' అన్నది విద్యావతి.

''అంతా సిద్ధంగా ఉన్నది,'' అంటూ దాపులనున్న స్నానం గదిని చూపించింది వృద్ధస్త్రీ.


విద్యావతి లోపలికి వెళ్ళి స్నానం చేసి, తనకోసం అక్కడ చక్కగా మడతబెట్టి వుంచిన దుస్తులు ధరించి వెలుపలికి వచ్చింది. అక్కడ ఇద్దరు పరిచారికలు తన దుస్తుల వంటివే ధరించి వుండడం చూసి ఆమె అమితాశ్చర్యం చెందింది.

వృద్ధస్త్రీ, విద్యావతికి వాళ్ళను చూపుతూ, ''వీళ్ళు నీ అవసరాలు సమకూర్చడానికి వచ్చిన నీల, మాల అనే పరిచారికలు. నీకు ఏం కావాలన్నా వీళ్ళను అడగవచ్చు.'' అన్నది.

''నువ్వూ ఇక్కడే వుంటావుకదా ?'' అని అడిగింది విద్యావతి.

''ఆఁ ... ఉంటాను; లేదు. అది వేరే విషయం. నీకది అనవసరం. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకో. నువ్వు నన్ను గాని, ఇతర పరిచారికలను గాని ఎటువంటి ప్రశ్నలూ అడగకూడదు. తెలిసిందా?'' అని హెచ్చరించి ఆ స్త్రీ వేగంగా వెలుపలికి వెళ్ళిపోయింది.

ఉదయం భోజనం చేశాక యువరాణి విద్యావతి ఆ విశాలమైన గదిలోని ఒక కిటికీ సమీపంలో వున్న ఆసనంలో కూర్చున్నది. గది గోడలకు అడుగు నుంచి, పైకప్పు వరకు కొంచెం కూడా ఖాళీలేకుండా నిలువుటద్దాలు అమర్చబడి ఉన్నాయి.


RAZI



రెండు పెద్ద కిటికీలగుండా బయట వున్న ఉద్యానవనం అందంగా కనిపిస్తున్నది. పరిచారిక లిద్దరూ గదిలోని వస్తువులనూ, తెరలనూ చక్కగా సర్దడం ప్రారంభించారు. వాళ్ళు గదిలో ఒకవైపునుంచి మరొక వైపుకు వెళుతూ వుంటే అద్దంలో వాళ్ళ ప్రతిబింబాలు రకరకాలుగా కనిపించసాగాయి. పరిచారికల వేషధారణ మాత్రమే కాదు, రూపురేఖలు కూడా తన లాగే వుండడం గమనించి యువరాణి ఆశ్చర్యం చెందింది.

మధ్యాన్నానికి ఒక పరిచారిక యువరాణికి భోజనం తెచ్చిపెట్టింది. యువరాణి మౌనంగా భోజనం ముగించి, వాళ్ళు చెప్పకముందే లేచి వెళ్ళి పరుపు మీద పడుకున్నది. ఒక పరిచారిక ఆమె దగ్గర నిలబడి మెల్లగా వింజామర వీవసాగింది. అలా సాయంకాలం వరకూ ఇద్దరు పరిచారికలలో ఎవరో ఒకరు ఆమె వెంట ఉంటూనే ఉన్నారు. సాయంకాలానికి "యువరాణీ! ఉద్యానవనంలో విహారానికి వెళదాం, రా," అంటూ వృద్ధస్త్రీ అక్కడికి వచ్చింది.

విద్యావతి నెమ్మదిగా లేచి మౌనంగా ఆ స్త్రీ వెంట నడిచి ఉద్యానవనం చేరింది. అడవి నుంచి ఉద్యానవనం మీదుగా వీస్తున్న గాలి యువరాణికి ఎంతో హాయిని కలిగించింది. ఆమె వెనకగా కొంతసేపు నడిచిన వృద్ధ స్త్రీ ఒకచోట కూర్చుని ఆమెనే గమనించసాగింది. విద్యావతి ఉద్యానవనంలో రకరకాల పువ్వులనూ చెట్లనూ చూస్తూ, కంబళి పరిచినట్టున్న పచ్చటి గడ్డిమీద చాలాసేపు నడిచింది. చీకటి పడుతూండగా ఇద్దరూ మళ్ళీ మాయాభవనం చేరారు.

భవనంలో ప్రవేశించి కొంత దూరం ముందుకు వెళ్ళాక విద్యావతికి కిందటి రాత్రి పడుకున్న శయనగృహాన్ని దాటి వచ్చేశామా అనిపించింది. వృద్ధస్త్రీ పక్కన వున్న తలుపు తెరిచింది. ఎదురుగుండా విశాలమైన గది కనిపించింది. కాని

అక్కడి తెరలు వేరొక రంగులో వుండడం విద్యావతి గమనించింది. భోజనం ముగించి, ఆమె అక్కడే పడుకుని ఆ రాత్రి హాయిగా నిద్రపోయింది.

మర్నాడు తెల్లవారగానే లేచి, ఆమె కిటికీ గుండా వెలుపలికి చూసింది. ఆమెకు ఉద్యానవనంలో వేరొక భాగం కనిపించింది. ఉద్యానవనంలోని మొక్కలూ, పువ్వులూ, నిన్నటివిలాగా లేవు. విద్యావతి లేచి స్నానానికి వెళ్ళింది. మొదటిరోజు లాగానే, ఆమెకు కావలసిన దుస్తులు అక్కడ మడతబెట్టి ఉన్నాయి. స్నానం ముగించుకుని వెలుపలికి రాగానే, అక్కడ వృద్ధస్త్రీ మరి ఇద్దరు పరిచారికలు కనిపించారు. ఆ ఇద్దరు పరిచారికలు కూడా, యువరాణి ధరించిన దుస్తులనే ధరించి వున్నారు. వాళ్ళు కవలలుగా కనిపించడమే కాదు, వాళ్ళలో తన పోలికలు కూడా కొంత ఉండడం విద్యావతి పసిగట్టింది.

"వీరి పేర్లు సురేఖ, సులేఖ. ఈరోజు వీళ్ళే నీకు కావలసిన అవసరాలు సమకూర్చగలరు!" అనిచెప్పి వృద్ధస్త్రీ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

తన దగ్గిరికి వచ్చిన ఒక పరిచారికతో విద్యావతి, "సురేఖా! నిన్నొక విషయం అడగనా?" అన్నది.



"నేను సులేఖను, యువరాణీ! ఏదైనా పానీయం తీసుకు రమ్మంటారా?" అన్నదా పరిచారిక.

"ఏదీ వద్దు. నువ్వు ఇక్కడ చాలా కాలంగా వుంటున్నావా?" అని అడిగింది విద్యావతి సూటిగా.

"లేదు, యువరాణీ! ఇక్కడకు వచ్చి రెండు నెలలు కూడా కాలేదు!" అన్నది సులేఖ.

"అలాగా, మరి అంతకు పూర్వం ఎక్కడ వుండేదానివి?" అని అడిగింది విద్యావతి.

"ఇంటి దగ్గరే, యువరాణీ!" అన్నది సులేఖ.



''నువ్వంటే నాకు చాలా ఇష్టం. నేను నా భవనానికి తిరిగి వెళ్ళేప్పుడు నాతో పాటు వస్తావా?'' అని అడిగింది విద్యావతి.

''ఇది కూడా మీ భవనమే యువరాణీ! యజమాని కోరినంత కాలం మీరిక్కడే ఉంటారు. ఆ తరవాత ఆయన మిమ్మల్ని తీసుకు వెళ్ళవచ్చు. అయితే, అది ఎప్పుడు ఎక్కడికి అన్న విషయాలు మాత్రం నాకు తెలియదు!'' అన్నది సులేఖ.

''అలాగా!'' అని అంతటితో ఊరుకున్నది విద్యావతి. ఆ తరవాత ఒకరితో ఒకరు ఏమీ మాట్లాడుకోలేదు.

మధ్యాహ్నం భోజనం చేసి, విద్యావతి కునుకు తీయడానికి తల్పం మీదికి చేరి, దూరంలో నిలబడి వున్న పరిచారికను చూసి, ''సులేఖా! ఇలా వచ్చి నాపక్కన కూర్చో. నిన్నొక విషయం అడగాలి!'' అన్నది.

''యువరాణీ! నేను సురేఖను,'' అంటూ దగ్గిరికి వచ్చిందా పరిచారిక.

''అలాగా! మీరిద్దరూ ఒకేలాగా వుండడం వల్ల, మీ పేర్లు తారుమారవుతున్నాయి. ఇంతకూ, మీరిద్దరూ కవలలే కదా?'' అని అడిగింది విద్యావతి.

''కాదు యువరాణీ! అసలు మేము తోబుట్టువులం కూడా కాదు,'' అన్నది సురేఖ.

''మీరెంత కాలంగా ఇక్కడ ఉంటున్నారు?'' అని అడిగింది విద్యావతి.

''ఒకటి రెండు నెలలుగా!'' అన్నది సురేఖ.

''ఇంత పెద్ద భవనంలో మీ రిద్దరే ఉంటున్నారా?'' అని అడిగింది విద్యావతి ఆశ్చర్యంగా.

''నిన్న మీకు పరిచర్యలు చేయడానికి నీల, మాల వచ్చారు. ఈ రోజు మేము వచ్చాము. రేపు, ఎల్లుండి, ఆ తరవాత వేరెవరో వస్తారు. మాలాగే ఇక్కడ ఇంకా కొందరు పరిచారికలు ఉన్నారు గాని,

వాళ్ళందరినీ నేను చూడలేదు. వాళ్ళ పేర్లు కూడా నాకు తెలియదు,'' అన్నది సురేఖ.


''మరి ఇక్కడ పురుషు లెవరూ లేరా? మీ యజమాని ఉన్నాడు కదా?'' అని అడిగింది విద్యావతి.

''ఉన్నారు గాని, పురుషులు దూరంగా విడిగా ఉంటారు. మా చాయలకు రారు. యజమాని ఎప్పుడోగాని రాడు. ఇంత వరకు నేను మా యజమానిని చూడ లేదు. సరే, యువరాణీ మీ నిద్రకు వేళయింది,'' అంటూ సురేఖ, విద్యావతి పడకను సిద్ధం చేసి, ఆమె పడుకోగానే పైన పట్టు వస్త్రం కప్పి, దూరంగా వెళ్ళి కిటికీ దగ్గరున్న చిన్న ఆసనంలో కూర్చున్నది.

సాయంత్రం విద్యావతి నిద్ర లేచేసరికి, ఆమెను విహారానికి తీసుకు వెళ్ళడానికి వృద్ధస్త్రీ అక్కడ సిద్ధంగా ఉన్నది. తను విహారానికి వెళ్ళేటప్పుడు వృద్ధస్త్రీ తప్ప మరొకరు రావడంలేదు. వృద్ధస్త్రీ కూడా తనతో తూచి తూచి మాట్లాడుతుందే తప్ప అవసరానికి మించి ఒక్కముక్క మాట్లా డడం లేదు. వీళ్ళందరినీ శాసిస్తున్నది ఎవరా అని ఆలోచిస్తూ విద్యావతి, వృద్ధ స్త్రీతోపాటు కొంతసేపు ఉద్యానవనంలో నడవసాగింది. చీకటి పడగానే ఇద్దరూ మాయాభవనంలోకి వచ్చారు. వృద్ధస్త్రీ తనను ఇప్పుడు వేరొక గదిలోకి తీసుకు వెళ్ళినట్టు విద్యావతి స్పష్టంగా గ్రహిం చింది.


మరునాడు ఆమె నిద్ర లేచేసరికి, మాలిని, శాలిని అనే ఇద్దరు పరిచారికలు వచ్చారు. వాళ్ళూ తాను ధరించిన దుస్తులే ధరించి ఒకేపోలికలతో ఉన్నారు. తనను ఇక్కడికి అపహరించుకుని వచ్చిన దుర్మార్గులు తనను ఇతరులు గుర్తు పట్టకుండా ఉండడానికి కావలసిన ఏర్పా ట్లన్నీ ముందే జాగ్రత్తగా చేసి వుంచారని విద్యావతి గ్రహించి, దీనికి తరుణోపాయం ఏమిటా అని తీవ్రంగా ఆలోచించ సాగింది. —(ఇంకావుంది)






[మహేంద్రనాధుడనే యువకుడు వీరసేనమహారాజు అనుమతి పొంది, విడిదిభవనం నుంచి కనిపించకుండా పోయిన యువరాణి విద్యావతిని వెతకటానికి బయలుదేరాడు. అతడు మొదట సారససరోవర విడిదిభవనం పరిసరాలను పరీక్షించి చూడటానికి అక్కడికి వెళ్ళి, పడవవాణ్ణి పలకరించి, అక్కడినుంచి అడవి కేసి బయలుదేరాడు. —తరవాత]

మహేంద్రనాధుడు, సారససరోవర తీరాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ, అరణ్యం కేసి నడక సాగించాడు. సరోవరం చుట్టూ సరైన మార్గం లేదు. ఏవేవో తీగలూ, ముళ్ళ పొదలూ అడ్డదిడ్డంగా అల్లుకుని ఉన్నాయి. జాగ్రత్తగా వాటిని తొలగించుకుంటూ, అక్కడక్కడా ఆగి, విడిదిభవనాన్ని పరీక్షించి చూస్తూ, అరణ్యంలోకి మార్గమేదైనా కనిపిస్తుందేమోనని వెతుకుతూ ముందుకు పోసాగాడు. ఆరోజు సూర్యాస్తమయం అయ్యేవరకూ ఎంత ప్రయత్నించినా, అతడికి అరణ్యంలోకి మార్గం కనిపించలేదు. ఆ రాత్రంతా ఒక చెట్టుకింద బండమీద గడిపాడు. తెల్లవారగానే లేచి చుట్టుపక్కల కలయచూశాడు. తను రాత్రి కూర్చున్న బండకు కొంత దూరంలో, సరోవరజలం నుంచి చిన్న మెట్లు కనిపించాయి. మహేంద్రనాధుడు



ఆ మెట్లను సమీపించాడు. మెట్లు సరిగ్గా కనిపించకుండా వాటిమీద చెట్లకొమ్మలు అడ్డదిడ్డంగా వేయబడి ఉన్నాయి. అతడు వాటిని తొలగించాడు. అడవిలోకి సన్నటి మార్గం కనిపించింది. ఒత్తుగా పచ్చటి ఆకులు పరచిన ఆ మార్గం, కొత్తగా ఏర్పరచిందని అతడు గ్రహించాడు. క్రూరమృగాలు తన మీదికి రాకుండా తగిన జాగ్రత్తతో మహేంద్రనాధుడు ముందుకు నడిచాడు.

దారికి ఇరువైపులా ఎత్తయిన చెట్లు ఉండడంవల్ల, సూర్యోదయం అయినప్పటికీ, మార్గం మసకచీకటిగానే ఉన్నది. అలా ఎంతోసేపు నడిచి, మహేంద్రనాధుడు సూర్యాస్తమయ వేళకు, ఒక సమతలప్రదేశాన్ని చేరాడు. మార్గానికి ఒకవైపున చిన్న కుటీరం కనిపించింది. అరణ్యమధ్యంలో ఈ కుటీరం ఎలా వచ్చిందా అని అనుకుంటూ మహేంద్రనాధుడు దానిని సమీపించాడు.

"ఎవరికోసం చూస్తున్నావు, నాయనా?" అన్న కంఠస్వరం వినిపించింది.

మహేంద్రనాధుడు, కంఠస్వరం వినిపించిన దిక్కుకేసి తిరిగి చూశాడు.

పెద్దపొదకు అవతలవైపున ఒక సన్యాసి, మొక్కలకు నీళ్ళు పోస్తూ కనిపించాడు. మహేంద్రనాధుడు, చేతులెత్తి ఆయనకు నమస్కరించి, "నేనొక ముఖ్యమైన కార్యం మీద బయలుదేరాను. అనుకోకుండా తమ దర్శనభాగ్యం కలిగింది," అన్నాడు.

ఆజానుబాహువయిన ఆ సన్యాసి ప్రశాంతవదనం చూసి మహేంద్రనాధుడు ఒక్కక్షణం ఆశ్చర్యం చెందాడు. కరుణతో నిండిన చూపులతో, ఆయన మందహాసం చేస్తూ, "ఇప్పటికే సూర్యుడు అస్తమించాడు. నీ గమ్యం ఏదైనప్పటికీ, ఈ రాత్రి ఇక్కడే గడిపి, తెల్లవారాక బయలుదేరు, నాయనా!" అని మహేంద్రనాధుడి భుజాన్ని ఆప్యాయంగా తాకి, కుటీరంకేసి నడిచాడు.

మహేంద్రనాధుడు ఆయనను అనుసరించాడు. ఇరువురూ కుటీరంలోకి ప్రవేశించాక, సన్యాసి ఒక చాపమీద కూర్చున్నాడు. మహేంద్రనాధుడు ఆయన పాదాలవద్ద కూర్చున్నాడు.

"నేను అనేక సంవత్సరాలు మనశ్శాంతికోసం దేశాలెన్నో తిరిగాను. అఖరికి ఇక్కడికి చేరాను. ఈప్రాంతానికి వచ్చిన తరవాత, మరెక్కడికీ వెళ్ళాలనిపించలేదు. నేనిక్కడికి వచ్చాక నన్ను చూసిన మొట్టమొదటి వాడివి నువ్వే." అన్నాడు సన్యాసి.

మహేంద్రనాధుడు మౌనంగా సన్యాసి పాదాలు ఒత్తసాగాడు.

"నాయనా, నువ్వెవరో, ఏ కార్యంమీద ఇటు వచ్చావో చెప్పనేలేదు!" అని అడిగాడు సన్యాసి.

"మహాత్మా! నా పేరు మహేంద్రనాధుడు. వీరగిరి రాజ్యానికి చెందినవాణ్ణి. చిన్నప్పుడే నా తండ్రి మరణించాడు. అప్పటినుంచి మా తల్లీకొడుకుల క్షేమాన్ని మా పినతండ్రీ, పినతల్లీ చూడసాగారు. కాని దురదృష్టవశాత్తు మాపినతల్లి కానుపు సమయంలో మరణించడంవల్ల, మా పినతండ్రి జీవితం మీద విరక్తితో, మమ్మల్ని వదలి ఎటో వెళ్ళిపోయాడు. అప్పటినుంచి నేనూ, మా తల్లి మాత్రం



ఉంటున్నాము. మా తల్లి దేవీఆలయానికి పూలమాలలు కట్టిఇస్తూ, దానిద్వారావచ్చే ఆదాయంతో బతుకుతున్నాము," అన్నాడు మహేంద్రనాధుడు.

ఆ మాటలు వినగానే, సన్యాసి చటుక్కున తన కాళ్ళు వెనక్కు లాక్కున్నాడు. దయనీయమైన తన వృత్తాంతాన్ని వినడంతో సన్యాసి హృదయం చలించిందని భావించిన మహేంద్రనాధుడు మళ్ళీ, "ఒక వారం క్రితం, వీరగిరి యువరాణి విద్యావతిని ఎవరో అపహరించారు. రాజభటులు ఆమెకోసం నలుదిశలా వెతికారు. కాని ఆమెజాడ తెలియలేదు. కాబట్టి, ఆమెను



వెతకటానికి నేను బయలుదేరాను. అందుకు రాజుగారి అనుమతి కూడా పొందాను. సరోవరాన్ని అనుకుని వున్న అరణ్యంలో ప్రవేశించి, ఇటుగా వచ్చి మిమ్మల్ని దర్శించాను,'' అన్నాడు.

''అలాగా! ఈ పరిసరాలలో మానవులెవరూ లేరు. ఒకవైపున ధవళగిరి పర్వతాలున్నాయి. వాటిలోకి మానవమాత్రులెవరూ ప్రవేశించలేరు. పర్వతానికి అవతల హిమగిరి రాజ్యం ఉన్నది. ఇక్కడినుంచి ఆ రాజ్యం చేరడంకూడా దుర్లభమే నాయనా!'' అన్నాడు సన్యాసి.

''పడమటిదిక్కునుంచి వెతికితేమంచి ఫలితం వుంటుందని జ్యోతిషాచార్యులు సెలవిచ్చారు, మహాత్మా! నేను యువకుణ్ణి; ఎంతటి కష్టాన్నయినా ఎదుర్కొగలను. ధర్మప్రభువయిన మా రాజు విచారాన్ని పోగొట్టడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. నా కర్తవ్యనిర్వహణలో నా ప్రాణాలను కూడా ఒడ్డడానికి సిద్ధంగా ఉన్నాను!'' అన్నాడు మహేంద్రనాథుడు.

''ఆదర్శపారుడుగా నీ కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి నువ్వు తీసుకున్న నిర్ణయం మెచ్చుకోదగినది. సరే, నిద్రపో. ఉదయమే బయలుదేరవచ్చు,'' అని సన్యాసికూడా నిద్రకు ఉపక్రమించాడు.

మహేంద్రనాథుడు ఉదయం నిద్రలేచే సరికి సన్యాసి ధ్యానంలో ఉన్నాడు. సన్యాసి కళ్ళు తెరవగానే, మహేంద్రనాథుడు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. సన్యాసి అతన్ని ఆశీర్వదించి, ''అపూర్వమైన నీ ధైర్యసాహసాలే నీకు విజయం సమకూరుస్తాయి. ఇదిగో, ఈ ఉంగరాన్ని ధరించు. దీనిని నీకోసమే దివ్యశక్తులు కలదిగా అభిమంత్రించాను. ఈ ఉంగరంలోని రాయికి ప్రత్యేకమైన శక్తులున్నాయి. అవి ఏవో మునుముందు నీకే తెలుస్తాయి. అయితే, ఈ విషయం నువ్వు మరెవరికీ చెప్పకూడదు. చెప్పావో, ఆ క్షణమే శక్తులన్నీ పోతాయి. నీ ప్రయాణంలో విజయం సాధించి, తిరిగి





వచ్చేటప్పుడు మీ తల్లిని చూసేముందు, నా దగ్గరికి రా. ఆ వృద్ధురాలు నీ రాకకోసం ఎంత తపిస్తున్నదో, ఏమో!'' అన్నాడు సన్యాసి.

''మహాత్మా! మా తల్లిని గురించి విచారించవలసిన అవసరం లేదు. ఆమె సంరక్షణాబాధ్యతలు రాజుగారే చూసుకుంటున్నారు. మీ ఆజ్ఞానుసారం, నా ప్రయాణం విజయవంతం అయ్యాక, తిరిగి వచ్చి మిమ్మల్నిదర్శిస్తాను. ఆశీర్వదించండి, మహాత్మా!'' అని నమస్కరించాడు మహేంద్రనాధుడు.

సన్యాసి అతన్ని ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. అప్పుడాయన కళ్ళు చెమ్మగిల్లడం చూసి మహేంద్రనాధుడు అమితాశ్చర్యం చెందాడు.

కుటీరం నుంచి వెలుపలికి వచ్చిన మహేంద్రనాధుడు, సేనానాయకుడి సలహాను గుర్తుకు తెచ్చుకుని, పడమటి దిక్కుకేసి బయలుదేరాడు. సరైన మార్గం లేకపోయినప్పటికీ, నడవడానికి అంత కష్టంగా లేదు. కొంతదూరం వెళ్ళాక, ఒక కొండ కనిపించింది. అతడు కొండ మీదికి ఎక్కుతూ, అక్కడక్కడా ఆగి కిందికి చూడసాగాడు. చెట్ల పైకొమ్మలు తప్ప అతడికేమీ కనిపించలేదు. సూర్యాస్తమయమయ్యే సమయానికి కొండశిఖరానికి చేరాడు. ఎదురుగుండా ఎత్తయిన గోడ కనిపించింది. అదొక పెద్ద భవనం ప్రహరీ గోడ అయివుంటుందని అనుకుని, సమీపించి చుట్టూ తిరిగిచూశాడు. ద్వారమార్గం కనిపించలేదు. చీకటి పడుతూ వుండగా ఒకచోట మెట్లు కనిపించాయి. ఆ మెట్లు మీదుగా మహేంద్రనాధుడు తలుపులు మూసిన ఇనుప ద్వారమార్గాన్ని చేరాడు. తలుపులకు బలమైన గొలుసు బిగించి ఉన్నది. అతడు గొలుసులను పట్టుకుని అటూఇటూ గట్టిగా కదిలించాడు. ఆ శబ్దం విని కొంతసేపటికి చేత కాగడాతో ఎవరో వచ్చి కొద్దిగా తలుపు తెరచి, ''మా యజమాని అనుకున్నాను! ఎవరు నువ్వు?

ఎందుకిలా వచ్చావు?" అని అడిగాడు ఆశ్చర్యంతో.

"నాపేరు మహేంద్రనాథుడు. వీరగిరి రాజ్యానికి చెందినవాణ్ణి. బతుకుతెరువు కోసం హిమగిరి రాజ్యానికి వెళుతున్నాను. ఈ పర్వతమార్గం దగ్గరిదారి అనిచెప్పారు. అయినా, ఇక్కడికి చేరడానికే మూడు రోజులుపట్టింది. పొద్దుపోయింది. లోపలికి అనుమతించావంటే, ఈ రాత్రికి ఇక్కడే వుండి నా దారిన నేను వెళతాను," అన్నాడు మహేంద్రనాథుడు.



గొలుసుకు బిగించిన తాళం తీసి, వాడు తలుపు తెరుస్తూ, "నేనీ భవన ద్వారపాలకుణ్ణి. లోపల నాకొక గది ఉన్నది. నువ్వు ఈ రాత్రికి అక్కడ పడుకోవచ్చు," అన్నాడు.

మహేంద్రనాథుడు వాడివెంట లోపలికి వెళ్ళాడు. ద్వారపాలకుడు అతన్ని తన గది లోపలికి తీసుకువెళ్ళి, "నువ్వు ఇక్కడే కూర్చో. నీ కేదైనా తినడానికి తెస్తాను. కొత్తవాళ్ళెవరినీ లోపలికి వదలకూడదని మా యజమాని ఆజ్ఞ. ఆయన ఇప్పుడిక్కడ ఉన్నట్టయితే నిన్ను లోపలికి అనుమతించేవాణ్ణి కాను," అన్నాడు.

"నా కారణంగా నువ్వు మీ యజమాని కోపానికి గురికావద్దు. నేను తెల్లవారకముందే వెళ్ళిపోతాను." అన్నాడు మహేంద్రనాథుడు.

"అలాగే! మా యజమాని చండశాసనుడే కాని, చాలా మంచి మనిషి. ఏ పరిస్థితిలో నిన్ను లోపలికి అనుమతించానో చెబితే నీమీద కనికరం చూపగల దయామూర్తి. నువ్వేమీ దిగులుపడవద్దు," అని చెప్పి ద్వారపాలకుడు గదినుంచి వెలుపలికి వెళ్ళాడు.

"అరణ్యమధ్యంలో ఎత్తయిన కొండ మీద నిర్మానుష్యంగా ఉన్న స్థలంలో ఈ భవనాన్ని ఎందుకు నిర్మించారు? ఈ భవనం యజమాని ఎవరై వుంటాడు? అతడు దయామూర్తి అని ద్వారపాలకుడు

చెబుతున్నాడు. అటువంటివాడు యువరాణిని అపహరించి తెచ్చి దాచి వుంటాడా?'' అని మహేంద్రనాధుడు రకరకాలుగా ఆలోచించసాగాడు.

ఇంతలో ద్వారపాలకుడు ఒకపళ్ళెంలో ఏవో ఆహారపదార్థాలు తెచ్చి, మహేంద్రనాధుడి ముందు వుంచి, ''ఈ పూటకు ఇదే లభించింది. దీనితోనే నీ ఆకలి తీర్చుకోవాలి!'' అన్నాడు.

''మీ యజమాని ఎప్పుడు వస్తాడు?'' అని అడిగాడు మహేంద్రనాధుడు యధాలాపంగా.

''ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళతాడో ఎవరికీ తెలియదు. అందువల్ల ఏక్షణంలో నైనా రావచ్చునని మేము సర్వవేళలా ఎంతో జాగ్రత్తగా వుంటాము,'' అన్నాడు ద్వారపాలకుడు.

''మేము, అంటున్నావు. మరి, ఇక్కడ నీతోపాటు ఇంకా ఎందరున్నారు. మీ యజమాని కుటుంబం వాళ్ళున్నారా?'' అని అడిగాడు మహేంద్రనాధుడు.

''మా యజమాని కుటుంబం వాళ్ళంటూ ఇక్కడ ఎవరూలేరు. ఆయన ఈ భవనంలో ఎప్పుడూ ఒంటరిగానే ఉంటారు. ఆయన తన గదిలో తాళపత్ర గ్రంథాలను పరిశీలిస్తూ రోజంతా గడుపుతారట. ఇటీవల ఇక్కడికెవరో ఒక గొప్ప స్త్రీ వచ్చింది. బహుశా ఆమె ఏదో ముఖ్యమైన విషయంలో మా యజమానిని సంప్రదించడానికి వచ్చివుంటుంది. ఆమెవచ్చిన తరవాత ఆయన రెండు రోజులపాటు తన గదినుంచి బయటకు రాలేదు. ఆ తరవాత హడావుడిగా ఎక్కడికో వెళ్ళిపోయాడు. అందుకే, ఆయన ఏక్షణంలో నైనా రావచ్చునని ఎదురుచూస్తున్నాము!'' అన్నాడు ద్వారపాలకుడు.

వాడు ఎవరో గొప్పస్త్రీ వచ్చిందని చెప్పగానే, మహేంద్రనాధుడికి ఆమె యువరాణి అయివుంటుందేమోనన్న అనుమానం కలిగింది. ఎలాగైనా, ఇక్కడే మరి కొన్నాళ్ళు ఉండడం అవసరమని అతడు నిర్ణయించుకున్నాడు. —(ఇంకావుంది)







[యువరాణి విద్యావతిని కనుగొనడానికి బయలుదేరిన మహేంద్రనాధుడికి అరణ్యమధ్యంలో ఒక సన్యాసి కనిపించి మహిమ గల ఉంగరాన్ని ప్రసాదించాడు.. అక్కడినుంచి ప్రయాణం కొనసాగించిన మహేంద్రనాధుడికి కొండమీద ఒక బ్రహ్మాండమైన భవనం కనిపించింది. ఆ భవన ద్వారపాలకుడు ఆ రాత్రి అక్కడే గడపటానికి అతనికి ఆశ్రయమిచ్చాడు.—తరవాత]

ఆ రాత్రి చాలా సేపు రకరకాల ఆలోచనలతో గడిపిన మహేంద్రనాధుడికి, మార్గ మధ్యంలో కనిపించిన సన్యాసి గుర్తుకు రాగానే, ఆయన ఇచ్చిన ఉంగరాన్ని ఒక సారి తాకి చూసుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తరవాత అలాగే నిద్రపోయాడు. తెల్లవారుతూ ఉండగా మేలుకుని లేచి కూర్చున్నాడు. చుట్టుపక్కల ఒకే హడావుడిగా ఉన్నది. అంతలో నే ద్వారపాలకుడు రెండు పళ్ళాలనిండా ఆహారం తెచ్చి మహేంద్రనాధుడి ముందుంచాడు. ఇద్దరూ కలిసి భోజనం చేసి చేతులు కడుక్కుంటున్నప్పుడు, మహేంద్రనాధుడు, ''మీ యజమాని వచ్చాడు కదా?'' అని అడిగాడు.

ద్వారపాలకుడు ఆశ్చర్యంతో కనుబొమలు పైకెత్తి, ''ఆ సంగతి నీకెలా తెలిసింది?'' అని అడిగాడు.



''రాత్రి నిద్రపోతుండగా ద్వారం గొలుసులను ఎవరో కదిలించడం లీలగా విన్నాను. ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే హడావుడిగా ఉన్నది కదా? ఆ కారణం గానే మీ యజమాని వచ్చాడని ఊహించాను,'' అన్నాడు మహేంద్రనాధుడు.

అవునన్నట్టు తల ఊపాడు ద్వారపాలకుడు.

''ఇకపైన నేను ఇక్కడ ఉండడం నీకుకష్టం కలిగించవచ్చు. నేనిక బయలుదేరతాను,'' అన్నాడు మహేంద్రనాధుడు.

''మా యజమాని వచ్చినమాట నిజమే కాని, అయన ఇటువైపు రానే రాడు. కాబట్టి నువ్వేమీ తొందరపడనవసరం లేదు. ఇక్కడ ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకుని నీ ప్రయాణం కొనసాగించవచ్చు. ఈలోగా ఇక్కడే ఏదైనా ఉద్యోగం దొరుకుతుందేమో ప్రయత్నించి చూస్తాను,'' అన్నాడు ద్వారపాలకుడు.

''నీ ఉపకారం మరువరానిది. మీ యజమాని కనికరించి నాకేదైనా ఉద్యోగం ఇస్తే ఇక్కడే మరికొన్నాళ్ళు గడుపుతాను. లేదా నీకు ఏమాత్రం ఇబ్బంది కలిగించకుండా రేపే నా ప్రయాణం కొనసాగిస్తాను,'' అన్నాడు మహేంద్రనాధుడు.


''ఆ సంగతి నాకు వదిలి, నువ్వు నిశ్చింతగా విశ్రాంతి తీసుకో. తగిన సమయం చూసి మా యజమానిని కలుసుకుని, నీ ఉద్యోగం సంగతి అడుగుతాను,'' అనిచెప్పి ద్వారపాలకుడు అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

మహేంద్రనాధుడు ఆ గదిలోనే కూర్చుని, ఒక కిటికీగుండా వెలుపలికి చూడసాగాడు. అక్కడి వాతావరణాన్ని చూడగానే మెరుపులా అతనికొక ఆలోచన వచ్చింది. హడావుడిగా పనులు చేసుకుంటూన్న సేవకులతో తనూ కలిసిపోయినట్టయితే, భవనం వెలుపలా, లోపలా పరిశీలించి చూసే అవకాశం లభిస్తుంది. అలాగే ద్వారపాలకుడు చెప్పిన కొత్తగా వచ్చిన ముఖ్యమైన స్త్రీ ఎవరో తెలుసుకో

వచ్చు. వెంటనే మహేంద్రనాధుడు అక్కడున్న ఒక బట్టను తీసి తలకు చుట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా సేవకుల మధ్యకు వెళ్ళిపోయాడు. సేవకులందరూ వారివారి పనులలో నిమగ్నులై ఉన్నారు. కొందరు ఉద్యానవనంలోని అందమైన విగ్రహాలను తుడుస్తున్నారు. మరికొందరు మొక్కలకు నీళ్ళు పడుతున్నారు; వాటిని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇంకా కొందరు భవనం కిటికీలను, తలుపులను తుడుస్తున్నారు. ఒక్కరుకూడా మహేంద్రనాధుణ్ణి గుర్తించలేదు. అతడు కొంతసేపు ఉద్యానవనంలో పనిచేసి, మెల్లగా భవనాన్ని సమీపించాడు. కిటికీలనూ, తలుపులనూ తుడుస్తూ భవనంలోపలికి వెళ్ళాడు. భవనం గదులన్నీ శుభ్రంగానూ, ఖాళీగానూ ఉన్నాయి. కొన్ని గదుల తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలగుండా లోపలికి తొంగిచూశాడు. లోపల గోడలకు నిలువుటద్దాలు అమర్చబడి ఉన్నాయి. వాటితో పాటు అక్కడక్కడా రకరకాల అద్దాలు చిన్నవీ పెద్దవీ చాలా కనిపించాయి.

మహేంద్రనాధుడు కొంతసేపు అలా పరిశీలించి చూసి, పక్కన ఒక చిన్న మార్గం కనిపించగానే అటుకేసి వెళ్ళి, తలుపులు సగం తెరుచుకుని ఉన్న ఒక గదిని సమీపించాడు. ఆ తలుపులను తెరచుకుని లోపలికి అడుగుపెట్టాడు. విశాలమైన ఆ గదినిండా నిలువుటద్దాలు ఉన్నాయి. ఒకవైపున చక్కని దేవీ





విగ్రహం కనిపించింది. ఆ విగ్రహానికి సమీపంలో పట్టుకంబళి పరచిన నేలమీద ముగ్గురు వృద్ధపండితులు కూర్చుని ఉన్నారు. ముగ్గురూ ఒకేవిధమైన కాషాయాంబరాలు ధరించి ఉన్నారు. ఇద్దరు ఏవో ప్రాచీన తాళపత్రగ్రంథాలను దీక్షగా పరిశీలిస్తున్నారు. మరొక వృద్ధుడు నేలమీద గీసిన పెద్దపెద్ద గీతలను పరిశీలిస్తున్నాడు. తలుపు తెరిచిన చప్పుడు వినగానే, "ఎవరు నువ్వు? ఎందుకిలా వచ్చావు?" అని అడిగాడు ఒక పండితుడు.

"గదిని శుభ్రంచేయడానికి వచ్చాను స్వామీ! తమకు ఇబ్బంది కలిగించినందుకు క్షమించండి. తరవాత వచ్చి, శుభ్రం చేస్తాను," అంటూ మహేంద్రనాధుడు ఆయనకు వంగి నమస్కరించి అడుగు వెనక్కు వేశాడు.

"ఈ గది శుభ్రంగానే ఉన్నది. నువ్వేమీ శుభ్రం చేయనవసరంలేదు. వెళ్ళు!" అన్నాడు వృద్ధపండితుడు.

"చిత్తం, స్వామీ!" అని మహేంద్రనాధుడు ఆయనకు మరొకసారి వినయంగా నమస్కరించి, వెనుదిరిగి గదినుంచి వెలుపలికి వచ్చాడు.

మహేంద్రనాధుడు వేగంగా ద్వారపాలకుడి గదిని చేరుకున్నాడు. కొంతసేపటికి ద్వారపాలకుడు, "బాగా విశ్రాంతి తీసుకున్నావా?" అంటూ లోపలికి అడుగుపెట్టాడు.

"ఆc, ఈ చుట్టుపక్కల సేవకులు హడావుడిగా పనులు చేసుకుంటున్నారు. వాళ్ళను చూస్తూ కూర్చున్నాను. పొద్దుపోయిందే తెలియలేదు. నువ్వు మీ యజమానిని చూశావా?" అని అడిగాడు మహేంద్రనాధుడు.

"మా యజమాని ఈసారి ఒంటరిగా రాలేదు. మరొక ముగ్గురు పెద్దలను వెంటబెట్టుకుని వచ్చాడు. వాళ్ళు జ్యోతిష్కులలాగా ఉన్నారు. వాళ్ళతో కలిసి మధ్యాన్నం భోజనం చేశాక మా యజ





మాని ఆయన గదిలోకి వెళ్ళాడు. అందువల్ల ఆయనను చూడటానికి సాధ్యపడలేదు. సాయంకాలం ఉద్యానవనానికి వస్తాడు. అప్పుడే మాట్లాడాలి,'' అనిచెప్పి ద్వారపాలకుడు అలాగే పడుకుని కొంత సేపటికల్లా నిద్రపోయాడు.

మహేంద్రనాథుడు ఆ తరవాత కిటికీ దగ్గరికి వెళ్ళి, వెలుపలికి చూస్తూ కూర్చున్నాడు. సూర్యాస్తమయానికి కొంత సేపు ఉందనగా, ఎవరో ఒకవ్యక్తి ఉద్యానవనంకేసి రావడం కనిపించింది. అతడు పొడవాటి అంగరఖా ధరించి ఉన్నాడు. పొడవాటి జుట్టు ఉన్నదిగాని గడ్డంమాత్రం పొట్టిగా ఉన్నది. రూపం స్పష్టంగా కనిపించడం లేదు కాని, అతని నడకలో రాచ ఠీవి ఉట్టిపడుతున్నది. అతడే ఆ భవనం యజమాని అయి వుంటాడని మహేంద్రనాథుడు ఊహించాడు. అతడు ఒకటి రెండుసార్లు ద్వారపాలకుడి గదికేసి చూడడం మహేంద్రనాథుడు గమనించాడు. వెంటనే అతడు నిద్ర పోతున్న ద్వారపాలకుణ్ణి తట్టిలేపి, ''మిత్రమా! మీ యజమాని ఉద్యానవనంలోకి వచ్చాడు. ఆయన నీకోసం చూస్తున్నట్లున్నది,'' అన్నాడు.

ద్వారపాలకుడు ఉలిక్కిపడి లేచి కిటికీగుండా బయటికి చూసి, ''అవును, ఆయనే మా యజమాని. ఆయన నిన్ను చూడలేదుగదా?'' అన్నాడు.

''లేదు! నేను లోపలే ఉన్నాను. గదినుంచి వెలుపలికి పోలేదు!'' అన్నాడు మహేంద్రనాథుడు.


ద్వారపాలకుడు హడావుడిగా తలపాగా ధరించి, ఉద్యానవనంలోకి వెళ్ళి, యజమానికి నమస్కరించాడు. యజమానీ, ద్వారపాలకుడూ ఏవో మాట్లాడుకోవడం మహేంద్రనాథుడికి కనిపించింది. యజమాని చేయెత్తి భవనం అవతలివైపుకు చూపుతూ ఏదో చెప్పాడు. ద్వారపాలకుడు వంగి నమస్కరించి వెనుదిరిగాడు. యజమాని భవనంలోకి వెళ్ళిపోయాడు.


చీకటి పడుతూండగా, ద్వారపాలకుడు వచ్చి మహేంద్రనాథుణ్ణి చూసి నవ్వుతూ, ''నీకొక శుభవార్త! మా యజమాని భవనానికి అవతలివైపున ఉన్న ద్వారపాలకుణ్ణి మార్చమన్నాడు. అవతలివైపున అందరూ స్త్రీలే ఉంటారు. అక్కడ కాపలా ఉండడానికి నీకు సమ్మతమైతే...'' అనే మాటను పూర్తిచేసేలోగా, ''తప్పక ఉంటాను. ఈరోజే ఆ ఉద్యోగంలో చేరతాను,'' అన్నాడు మహేంద్రనాథుడు.

''మంచిది. నాతోరా మిత్రమా! నేను నిన్ను అక్కడికి తీసుకువెళతాను. అటువైపు సాధారణంగా మనుషులెవరూ రారు. తలుపులు ఎప్పుడూ మూసే ఉంటాయి!'' అంటూ ద్వారపాలకుడు దివిటీ వెలిగించి, తీసుకుని ముందు నడవసాగాడు. మహేంద్రనాథుడు అతణ్ణి అనుసరించాడు. ఇద్దరూ కొంతదూరం నడిచాక కిందికి మెట్లు కనిపించాయి. వాటిగుండా మరికొంత దూరం నడిచాక గొలుసులు బిగించిన ఇనుపద్వారం కనిపించింది. అక్కడి నుంచి భవనం అంత స్పష్టంగా కనిపించడంలేదు. ద్వారపాలకుడు, ''ఇక్కడ పెద్దగా పనిఏదీ ఉండదు. నేను నీకు కావలసిన ఆహారం తెచ్చి పెడతాను. పొద్దున నేను రాగానే నువ్వు వెళ్ళి నాగదిలో విశ్రాంతి తీసుకోవచ్చు. ఈ దివిటీ ఇక్కడే ఉండనీ. జాగ్రత్త సుమా!'' అని హెచ్చరించి వెళ్ళాడు.

దాదాపు రెండు గంటలు గడిచాక ద్వారపాలకుడు ఆహారం తెచ్చాడు. మహేంద్రనాథుడు భోజనం చేసిన తరవాత, ద్వారపాలకుడు తాళంచెవి ఒకటి అందిస్తూ, ''దీనిని జాగ్రత్తగా ఉంచు. తలుపు తెరుచుకుని వెళ్ళేవు సుమా! అంతా కీకారణ్యం. దారీతెన్నూ కనిపించదు,'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళాక మహేంద్రనాథుడు ఆ భవనంలో ఉన్న స్త్రీ యువరాణా? కాదా అన్న విషయం తెలుసుకోవడం ఎలాగా అని ఆలోచిస్తూ, జాగ్రత్తగా అక్కడే కూర్చున్నాడు. —(ఇంకావుంది)





# మాయా భవనం

9

[యువరాణి విద్యావతిని వెతకడానికి వెళ్ళిన మహేంద్రనాథుడికి అరణ్యమధ్యంలో ఒక భవనం కనిపించింది. ఆ భవన ద్వారపాలకుడితో అతనికి స్నేహం ఏర్పడింది. మర్నాడు అక్కడి సేవకులలో ఒకడుగా వెళ్ళి మహేంద్రనాథుడు భవనం లోపలి గదులను చూసి వచ్చాడు. అతడు భవనం అవతలివైపు ద్వారంవద్ద కాపలాదారుగా చేరాడు. —తరవాత]

"విద్యావతి కనిపించకుండాపోయి, ఒక వారం గడిచి పోయింది. ఇంతవరకూ ఆమె ఎక్కడ ఉన్నదీ తెలియలేదు!" అన్నది రాణి వజ్రేశ్వరీదేవి రాజుతో పట్టరాని దుఃఖంతో.

వీరసేన మహారాజు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. కొంతసేపు మౌనం వహించి, ఆతరవాత ఆయన, "విద్యావతిని వెతకడానికి నలుదిశలకూ మన భటులను పంపాము. వాళ్ళల్లో ఇంకా కొంతమంది తిరిగి రాలేదు. మనరాజ్య పౌరులు కూడా కొందరు యువరాణిని వెతకడానికివెళ్ళారు. త్వరలో శుభవార్త అందగలదు. విచారించకుదేవీ," అన్నాడు ఆమెను నెమ్మదిగా ఓదార్చుతూ.

"విద్యావతిని వెతకడానికి మీ అనుమతి కోసం ఒక యువకుడు వచ్చాడని చెప్పారు కదా? అతడు ఏమయ్యాడు?" అని అడిగింది రాణి.



"ఆ... అవును, మహేంద్రనాధుడుకూడా ఇంకా రాలేదు. దృఢసంకల్పంతో వెళ్ళిన ఆ సాహసయువకుడు, తప్పకుండా మన విద్యావతి జాడను కనుగొని రాగలడన్న నమ్మకంనాకున్నది!" అన్నాడు రాజు ఎంతో విశ్వాసంతో.

"విద్యావతిని వేరొక దూరరాజ్యానికి అపహరించుకుని వెళ్ళారేమో," అని తన అనుమానాన్ని వెలిబుచ్చింది రాణి.

"ఆ అనుమానంతోనే నీ సోదరుడు ఉగ్రసేనుడు, పొరుగు రాజ్యాలలోని మన వేగులకు ఈ విషయం తెలియజేశాడు. కాబట్టి, నువ్వేమీ భయపడనవసరం లేదు. పైగా, విద్యావతికి గ్రహాల ప్రతికూల దశ కూడా త్వరలో అంతం కానున్నది. ఆమె మనల్ని చేరే సమయం అట్టే దూరంలో లేదు. ధైర్యంగా ఉండు. వాచస్పతాచార్యులను రప్పించి యువరాణి గ్రహస్థితి ఎలా ఉన్నదో తెలుసుకుందాం," అని చెప్పి, రాజు ఒక భటుణ్ణి పిలిచి, ప్రధాన జ్యోతిషాచార్యులు వాచస్పతిని వెంట బెట్టుకుని రమ్మని ఆజ్ఞాపించాడు.

ఆ రోజు సాయంకాలం రాజును చూడడానికి వచ్చిన వాచస్పతాచార్యులు, ఆయనకు నమస్కరించి, "నేను తమ దర్శనానికి బయలుదేరుతూ ఉండగా భటుడు వచ్చాడు. ఇతడు నాశిష్యులలో ముఖ్యుడైన మంజునాధుడు. ఇతడొక వార్త తెచ్చాడు. దానిని తెలియజేయడానికి ఇతణ్ణి కూడా తీసుకు వచ్చాను," అన్నాడు వెంటబెట్టుకుని వచ్చిన యువకుణ్ణి చూపుతూ.

"విద్యావతిని గురించేనా?" అని అడిగింది రాణి ఆతృతగా.

వెంటనే మంజునాధుడు, "ఒక విధంగా యువరాణిని గురించే మహారాణీ! జ్యోతిషశాస్త్రంలో నాకు కలిగిన కొన్ని సందేహాలను తీర్చుకోవడానికి నేను రాజ్యంలోని ప్రముఖ జ్యోతిషపండితులను కలుసుకోవడానికి వెళ్ళాను. అప్పుడు వారు, యువరాణి విద్యావతీదేవి జాతకాన్ని పరిశీలించడానికి వారిని జగత్పతాచార్యుడు ఆహ్వానించినట్టు నాతో



చెప్పారు. జగత్పతిని నేను లోగడ ఒకటి రెండుసార్లు మా గురువుగారి గృహంలో చూశాను. అందువల్ల ఆ సంగతి ఆయనకు తెలియజేయడానికి వెళ్ళాను. అయితే, అక్కడ జగత్పతి జాడలేదు," అన్నాడు.

"యువరాణి జాతకం గురించిన సకల వివరాలూ నేను జగత్పతితో చర్చించాను. యువరాణి కనిపించకుండా పోయిన రోజు నుంచి జగత్పతి నా దగ్గరికి రాకపోవడం; ఇప్పుడు నాకు తెలియకుండా యువరాణి జాతకం గురించి అతడు ఇతర జ్యోతిష పండితులతోచర్చించడం, వింతగాఉన్నది. ఆ విషయం నా నుంచి దాచడం మరీ విడ్డూరంగానూ, అంతుబట్టని విషయం గానూ ఉన్నది!" అన్నాడు వాచస్పతా చార్యులు విచారంగా.

"అయినా, జగత్పతి స్వభావం ఎటు వంటిదో, అతడు నమ్మతగిన వాడో, కాదో మీకే తెలియాలి. ఒకవేళ అతడు మీకు తెలియకుండా ఇతర జ్యోతిష పండితులతో సంప్రదించిన తరవాత, యువరాణి భవిష్య త్తును గురించి ఏదైనా శుభవార్త తీసుకు వస్తాడేమో, వేచి చూద్దాం!" అన్నాడు రాజు.

"ఈనాటి వరకు జగత్పతి నిజాయితీని అనుమానించవలసిన పరిస్థితినాకు ఏర్పడ లేదు. అయితే, ఇప్పుడు అతడు యువ రాణి జాతకం గురించి ఇతర జ్యోతిష పండితులతో చర్చిస్తూ, ఆ విషయాన్ని నానుంచి దాస్తున్నాడంటే అతన్ని అనుమా నించవలసివస్తున్నది. ఇప్పుడతడు ఎక్కడు న్నాడు? ఏం చేస్తున్నాడు? మొదలైన సంగ తులు తెలుసుకోవాలి. సరే, అతని జాడ తెలియగానే నేనే స్వయంగా మీ దగ్గరికి వస్తాను," అని చెప్పి, రాజు దగ్గర సెలవు తీసుకుని, వాచస్పతాచార్యులు శిష్యుడితో సహా అక్కడి నుంచి బయలుదేరాడు.

ఆ తరవాత రాజు, వాచస్పతాచార్యులు చెప్పిన సంగతిని సేనానాయకుడు ఉగ్ర సేనుడితో చెప్పాడు. అంతా విన్న ఉగ్ర సేనుడు, "యువరాణి జాతకంపట్ల జగత్పతి చూపిన అమితమైన ఆసక్తిని గమనించి



నప్పుడే నాకు అతడి ప్రవర్తన పట్ల అనుమానం ఏర్పడింది. యువరాణి కనిపించకుండా పోయిన తరవాత అతడు అంతులేకపోవడంతో ఆ అనుమానం మరింత ఎక్కువయింది. అతడి నివాసస్థానం, పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికి ఎంతో ప్రయత్నించాను. కాని ప్రయోజనం లేకపోయింది. అతడొక విచిత్రమైన వ్యక్తి లాగే ఉన్నాడు. అతడిపట్ల మనమెంతో జాగ్రత్తగా వ్యవహరించాలి!" అన్నాడు.

"సరే, మహేంద్రనాధుడి నుంచి ఏదైనా సమాచారం అందిందా? అతని తల్లి క్షేమంగా ఉన్నది కదా?" అని అడిగాడు రాజు.

"ఆమెకు ఏ కొరతా లేకుండా చూసుకుంటున్నాము. మహేంద్రనాధుడు ఇంకా తిరిగి రాలేదు. ఎటువంటి సమాచారమూ లేదు," అన్నాడు ఉగ్రసేనుడు.

"నాకెందుకోగాని, ఆ యువకుడు తప్పకుండా విద్యావతి ఎక్కడున్నదో తెలుసుకుని రాగలడన్న నమ్మకం కలుగుతున్నది!" అన్నాడు రాజు.

* * *

రాత్రంతామేలుకుని ఉన్నప్పటికీ మహేంద్రనాధుడికి అంత కష్టమనిపించ లేదు. ద్వారం వద్ద కొంతసేపు కూర్చున్నాడు. ఆ తరవాత ద్వారానికీ, ఉద్యానవనానికీ మధ్య ఉన్న చిన్న మార్గంకుండా కొంతదూరం ముందుకువెళ్ళి చుట్టుపక్కల పరిసరాలను కలయజూశాడు. భవనం కిందిగదులన్నిటి నుంచీ వెలుతురు కనిపిస్తున్నది. అయితే, పై అంతస్తులో ఒకటి రెండు గదులలో మాత్రమే దీపాలు వెలుగుతున్నవి. కొంత రాత్రి గడిచిన తరవాత, కిందిభాగంలోని గదులలో దీపాలు ఆరిపోయాయి. పై భాగంలోని రెండు గదులలో వెలుతురు చాలాసేపు కనిపించింది. ఆ తరవాత ఆ గదులలోని దీపాలు కూడా ఆరిపోవడం వల్ల అంతటా చిమ్మచీకటి ఆవరించింది.

తెల్లవారుతూ ఉండగా అక్కడికి ద్వారపాలకుడు వచ్చి, మహేంద్రనాధుణ్ణి వెంట

బెట్టుకుని భవనం దక్షిణం వైపుకు తీసుకు పోయాడు. అక్కడొక విశాలమైన భోజనాల గది ఉన్నది. భోజనానికికూర్చున్న మహేంద్ర నాథుడు తల పక్కకి తిప్పి చూశాడు. తెల్ల చీర కట్టుకుని మేలి ముసుగు వేసుకుని ఉన్న ఒక వృద్ధస్త్రీ, వంటగది నుంచి వెలు పలికి రావడం కనిపించింది. ఆమె వెంట ఇద్దరు పరిచారికలు రెండు పళ్ళాల నిండా ఆహార పానీయాలను తీసుకుని వెళు తున్నారు. ఆ ఇద్దరు పరిచారికలు కూడా ఒకేవిధమైన దుస్తులూ, ఆభరణాలూ ధరించి ఉండడం చూసి ఆశ్చర్యం చెందిన మహేంద్రనాథుడు భోజనం ముగించి, విశ్రాంతి తీసుకోవడానికి ద్వారాపాలకుడి గదికి వెళ్ళాడు.

సూర్యుడు పడమర దిశకు వాలుతూ ఉండగా మహేంద్రనాథుడు నిద్రలేచి, తాను కాపలా ఉండవలసిన భవనం అవ తలి ద్వారాన్ని చేరుకున్నాడు.

సూర్యాస్తమయానికి కొంతసేపు ఉన్న ప్పుడు, మహేంద్రనాథుడు తాను కూర్చున్న బండమీదికి ఎక్కి నిలబడి చూశాడు. దూరంలో భవనం మెట్లు కొంత భాగం తప్ప ఏదీ కనిపించలేదు. ఉద్యానవనంలో ఏదో అలికిడి వినిపించడంతో అతడు అటు వైపుకు వెళ్ళాడు. అక్కడ అతనికి ఉదయం భోజనగృహం దగ్గిర కనిపించిన వృద్ధస్త్రీ కనిపించింది. ఆమెకు వెనక కొంత దూరంలో ఒక అందమైన యువతి, ఉద్యాన వనంలోని పువ్వులను సుతారంగా





తాకుతూ, నడుస్తున్నది. మహేంద్రనాథుడు ఉదయం చూసిన పరిచారికలలాగే ఈ యువతి దుస్తులూ, ఆభరణాలూ ధరించి ఉన్నది. అయితే ఈమె అద్భుత సౌందర్య వతి!

మహేంద్రనాథుడు ఏదో పనిలో నిమగ్నుడై ఉన్నవాడిలాగా, ముందుకూ, వెనక్కూ నడుస్తూ ఎవరికీ అనుమానం కలగకుండా వాళ్ళను గమనించసాగాడు. వాళ్ళిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడలేదు. వృద్ధస్త్రీ ఒకచోట కూర్చుని వనవిహారం చేస్తున్న యువతిని జాగ్రత్తగా గమనిస్తున్నది. కొంతసేపయ్యాక, మరొక యువతి ఉద్యానవనంలోకి వచ్చి, వృద్ధస్త్రీతో ఏదో చెప్పింది. వెంటనే వృద్ధస్త్రీ భవనంలోపలికి వెళ్ళింది. వచ్చినయువతి, ఉద్యానవనంలో ఉన్న యువతిని సమీపించింది. వారిద్దరి దుస్తులు కూడా, ఒకేవిధంగా ఒకే రంగులో ఉన్నాయి. మరి కొంతసేపు అక్కడే గడిపి, చీకటి పడుతూ ఉండగా యువతి ఆ సౌందర్యవతిని భవనం లోపలికి తీసుకు వెళ్ళింది. వాళ్ళు వెళ్ళగానే భవనం పైభాగం లోని ఒక గదిలోని దీపాలు వెలిగాయి. అయితే ఆగది నిన్న రాత్రి దీపాలు వెలిగిన గది కాదని మహేంద్రనాథుడు గ్రహించాడు.

ద్వారపాలకుడు చెప్పిన ముఖ్యమైన స్త్రీ ఎవరై ఉంటారా అని ఆలోచిస్తూ, మహేంద్రనాథుడు ద్వారం దగ్గర కూర్చున్నాడు. ఉద్యానవనంలో చూసిన ఇద్దరు యువతులు కూడా ఒకే విధమైన దుస్తులు ధరించి ఉండడం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

ఆ తరవాత చాలాసేపటికి, ఆహారం తీసుకుని వచ్చిన ద్వారపాలకుణ్ణి, "ఈ ప్రాంతం చాలా నిశ్శబ్దంగా ఉన్నది. యజమాని వెళ్ళిపోయాడా ఏం?" అని అడిగాడు మహేంద్రనాథుడు యథాలాపంగా.

"లేదు, లేదు. యజమాని ఇక్కడే ఉన్నాడు. ఆయన రాత్రీ, పగలూ జ్యోతిష్కులతో చర్చలు జరుపుతున్నాడు. కాబట్టి ఇటువైపు రాడు. అయినా, నువ్వు జాగ్రత్తగా



ఉండాలి సుమా!" అని హెచ్చరించాడు ద్వారపాలకుడు.

"నేను ఇక్కడ కాపలా ఉన్నట్లు యజమానికి తెలుసా?" అని అడిగాడు మహేంద్రనాథుడు, చేతులు కడుక్కుని భోజనం చేయడానికి కూర్చుంటూ.

"తెలుసు. నిన్న నేను చెప్పాను. మరొక ముఖ్యమైన విషయం ఏమంటే ప్రస్తుతం ఈ భవనంలో ఉన్న ముఖ్యమైన స్త్రీ, ఏదో రాజ్యానికి యువరాణి అని చెబుతున్నారు. ఆమె ఇక్కడే మరి కొంతకాలం ఉంటుందట! కాబట్టి నువ్వు మరీ జాగ్రత్తగా ఉండాలి! గుర్తుంచుకో!" అని మళ్ళీ హెచ్చరించాడు ద్వారపాలకుడు.


"ఒకవేళ యజమాని ఇటువైపువచ్చినా రావచ్చు కదా! నేను కంటిమీద రెప్ప వేయకుండా చాలా జాగ్రత్తగా చూసుకుంటాను. ఆ విచారం నీకు వద్దు," అన్నాడు మహేంద్రనాథుడు భోజనం ముగించిలేస్తూ.

"నీ మంచితనం చూసి, నీమీది విశ్వాసంతో, యజమానితో చెప్పి నీకీ ఉద్యోగం ఇప్పించాను. నీ ఉద్యోగధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించి నాపేరు నిలబెట్టగలవని నమ్ముతున్నాను," అన్నాడు ద్వారపాలకుడు.

"నీమేలు మరువరానిది. నీకు ఎప్పుడూ విశ్వాసపాత్రుడుగా ఉంటాను," అన్నాడు మహేంద్రనాథుడు.

ద్వారపాలకుడు అక్కడినుంచి వెళ్ళిపోయాక, మహేంద్రనాథుడు మెల్లగా ఉద్యానవనంలోకి వెళ్ళాడు. అక్కడి నుంచి భవనం స్పష్టంగా కనిపిస్తున్నది. తలుపులన్నీ మూసి ఉన్నాయి. భవనం కింది భాగంలోని కిటికీ రెక్కలు కూడా మూసి ఉన్నాయి. భవనం పై అంతస్తులోని కిటికీ రెక్కలు కొన్ని తెరిచి ఉన్నాయి. చుట్టుపక్కల ఎక్కడా మనుషుల జాడలేదు. మహేంద్రనాథుడు అక్కడి పరిసరాలను మరొక్కసారి పరిశీలనగా చూసి, యువరాణిని కనుగొనడానికి ఏంచేయడమా అని తీవ్రంగా ఆలోచిస్తూ, మెల్లగా తిరిగి వెళ్ళి ద్వారం దాపులనున్న ఆసనంలో కూర్చున్నాడు. — (ఇంకావుంది)






# 10

[విద్యావతి కనిపించకుండా పోయిన నాటి నుంచి తన దగ్గరకు రాని జగత్పతి ప్రవర్తనపట్ల వాచస్పతాచార్యులకు అనుమానం కలిగి, ఆయన ఆ సంగతిని రాజుకు తెలియపరచాడు. యువరాణిని వెతకడానికి వెళ్ళిన మహేంద్రనాధుడు, అరణ్యమధ్యంలోని మాయాభవనం కాపలాదారుగా చేరి అక్కడి పరిసరాలను ఎంతో జాగ్రత్తగా పరిశీలించ సాగాడు. – తరవాత]

మరునాడు సాయంకాలం మహేంద్రనాధుడు, ముందుగానే తాను కాపలా ఉండవలసిన ద్వారం, దగ్గరికి చేరుకున్నాడు. మాయాభవనం నుంచి ఎవరైనా వెలుపలికి వస్తారా అని మాటిమాటికి ఉద్యానవనం కేసి చూడసాగాడు. కొంత సేపటికి ముగ్గురు యువతులు భవనం నుంచి వెలుపలికి వచ్చారు. వాళ్ళ వెంట వృద్ధస్త్రీ లేదు. ముగ్గురు యువతులూ ఒకేవిధమైన దుస్తులూ, ఆభరణాలూ ధరించి ఉండడంవల్ల, వెంటనే నిన్న కనిపించిన యువతి ఎవరో పోల్చుకోలేక పోయాడుమహేంద్రనాధుడు. కొంతసేపటికి ఆ ముగ్గురిలో ఒక యువతి వెళ్ళిపోయింది. ఉద్యానవనంలో ఇద్దరు మాత్రమే మిగిలారు. తరవాత ఆ ఇరువురిలో ఒక యువతి ఉద్యానవనంలో విహరించ సాగింది. మరొక యువతి ఒకచోట కూర్చున్నది.



మహేంద్రనాథుడు ఒక చెట్టు చాటున నిలబడి, ఆ యువతి అటుకేసి వచ్చినప్పుడు, "యువరాణి, విద్యావతీ!" అని పిలిచాడు మెల్లగా. ఆ యువతి చప్పున తల తిప్పి కంఠస్వరం వినిపించిన దిక్కుకేసి చూసింది. కాని అతడెక్కడున్నాడో పసిగట్టలేక ముందుకు నడిచింది. తిరిగి ఆమె ఆ చెట్టు దగ్గరికి వచ్చినప్పుడు మళ్ళీ మహేంద్రనాథుడు ఆమె పేరుపెట్టి పిలిచాడు. అప్పుడా యువతి కొంతసేపు అక్కడ ఆగిందే తప్ప, తనకు కాపలా ఉన్న పరిచారికకు అనుమానం రాకుండా ఉండాలన్న ఉద్దేశంతో, మళ్ళీ కొంత ముందుకు నడిచి వెనక్కు తిరిగి వచ్చింది.

అప్పుడు మహేంద్రనాథుడు చెట్టు చాటు నుంచి తొంగి చూశాడు. వెంటనే ఆ యువతి తన వేలిని నోటికి అడ్డుగా ఉంచి గట్టిగా మాట్లాడ వద్దని అతన్ని హెచ్చరించింది. అంతలో దూరంగా కూర్చున్న పరిచారిక లేచి వేగంగా తనకేసి రావడం గమనించిన ఆ యువతి, ఆకాశం కేసి చూస్తూ, "రేపు" అని చెప్పి తిన్నగా భవనం కేసి నడవ సాగింది.

ఆనాటి రాత్రి మహేంద్రనాథుడు మరింత జాగ్రత్తగా కాపలాకాయ సాగాడు. మాయాభవనం పైఅంతస్థులోని ఒకే ఒక గదిలో మాత్రం దీపాలు వెలుగుతున్నాయి. అయితే, అది నిన్న దీపాలు వెలిగిన గది కాదు. అంటే, ఉద్యానవనం నుంచి తిరిగి వెళ్ళిన ఆ యువతి ఒక్కొక్క రాత్రి ఒక్కొక్క గదిలో గడపడానికి ఏర్పాట్లు చేశారని అతడు గ్రహించాడు. పైగా, ముగ్గురు యువతులూ ఒకేవిధమైన దుస్తులూ, ఆభరణాలూ, ధరించేట్టు చేయడం, కొత్త వాళ్ళకు యువరాణిని గుర్తుపట్టకుండా చేయడానికి తీసుకున్న జాగ్రత్త అని కూడా మహేంద్రనాథుడు గ్రహించాడు.

కొంతసేపటికి అక్కడికి వచ్చిన ద్వారపాలకుణ్ణి, "మిత్రమా! ఈ రోజంతా కనిపించనేలేదు, ఏమిటి విశేషం?" అని చిరునవ్వుతో పలకరించాడు మహేంద్రనాథుడు.

"అవును, ఇవాళ మరికొందరు పండితులు వచ్చారు. వచ్చినవారిని వెంటనే యజమాని దగ్గరికి తీసుకువెళ్ళాలి కదా! అందుకని అక్కడే ఉండిపోయాను. నువ్విక్కడ జాగ్రత్తగా ఉండు సుమా!" అని హెచ్చరించి హడావుడిగా వెళ్ళిపోయాడు ద్వారపాలకుడు.

మరునాడు ఉదయం కూడా వంటశాల నుంచి ఇద్దరు పరిచారికలు ఆహారపానీయాలు తీసుకుని వెళ్ళడం మహేంద్రనాధుడు గమనించాడు. అప్పుడు వాళ్ళ వెంట వృద్ధస్త్రీ లేదు.



ఆ రోజు సాయంకాలం ఆ యువతి కాస్త ముందుగానే వనవిహారానికి వచ్చింది. ఆమె వెంట ఒక పరిచారిక మాత్రమే ఉన్నది. ఇద్దరూ కలిసి కొంతసేపు వనంలో అటూ ఇటూ తిరిగారు. ఆ తరవాత పరిచారిక ఒకచోట కూర్చున్నది. ఆ యువతి ఏపుగా ఉన్న చెట్ల దగ్గరికి వచ్చి ఎవరినో వెతుకుతున్నట్టు చెట్లలోకి చూసి ముందుకు వెళ్ళింది. ఆమె మళ్ళీ అటు వచ్చినప్పుడు, "యువరాణీ! నేను మహేంద్రనాధుణ్ణి, వీరగిరి నుంచి వచ్చాను," అన్నాడు చెట్టుచాటున దాక్కుని ఉన్న మహేంద్రనాధుడు.

ఆ యువతి ఆ మాటలను వినికూడా అక్కడ ఆగలేదు. కొంతదూరం ముందుకు వెళ్ళి, తిరిగివచ్చి, "అవును, నేను యువరాణి విద్యావతినే! ఇక్కడి నుంచి బయటపడాలి!" అన్నది మెల్లగా.

"యువరాణీ! నిన్ను ఇక్కడికి అపహరించుకుని వచ్చిన వారెవరు?" అని అడిగాడు మహేంద్రనాధుడు.

"నాకు తెలియదు: ఆ సంగతి ఒక్క వృద్ధస్త్రీకి మాత్రమే తెలుసు," అన్నది యువరాణి.

"ఆమె ఎవరు? ఎక్కడ ఉంటుంది?" అని అడిగాడు మహేంద్రనాధుడు.

"ఆమె పేరు కమల అని చెప్పుకుంటుంది. ఆమె రూపం మాత్రం, రాజప్రాసాదం లోని వృద్ధపరిచారిక కమలలాగే ఉంటుంది. అయితే, ఆమె కూడా నిన్నటి



నుంచి కనిపించ లేదు!" అన్నది యువ రాణి.

"నీ వెంటవున్న పరిచారికలు ఎవరు?" అని అడిగాడు మహేంద్రనాధుడు.

"చాలామంది ఉన్నారు. చూడడానికి అందరూ ఒకే లాగా ఉంటారు. వాళ్ళ పేర్లు కూడా నాకు సరిగ్గా గుర్తులేదు!" అన్నది యువరాణి.

"వాళ్ళేమీ నీతో చెప్పలేదా?" అని అడిగాడు మహేంద్రనాధుడు.

"అవసరానికి మించి ఒక్క ముక్క మాట్లాడరు. ఏదో కుట్రలాగా కనిపిస్తున్నది. ఆపద ముంచుకురాక ముందే ఇక్కడి నుంచి తప్పించుకోవాలి," అని చెప్పి, యువరాణి దూరంగా ఉన్న పరిచారిక దగ్గరికి వెళ్ళింది. అంతలో అక్కడికి మరొక పరిచారిక కూడా రావడంతో, ముగ్గురూ కలిసి మౌనంగా మాయాభవనం లోపలికి వెళ్ళారు.

యువరాణిని చూసిన ఉత్సాహంతో ఉప్పొంగిపోయాడు మహేంద్రనాధుడు. అదృష్టవశాత్తు యువరాణి క్షేమంగానే ఉన్నది. ఆమెను ఇక్కడికి తీసుకువచ్చిన వారెవ్వరు? తాను దూరం నుంచి చూసిన ఈ మాయాభవన యజమాని, ఆ పని చేసి ఉంటాడా? అతడు కాకపోతే మరెవ్వరు చేశారు? ఎందుకు ఆ పని చేశారు? యువరాణిని సురక్షితంగా రాజుగారికి అప్పగించడం ఎలాగా? అని ఆలోచిస్తూ కూర్చున్నాడు మహేంద్రనాధుడు.

"ఏమిటి బాగా అలిసి పోయినట్టున్నావు?" అన్న ద్వారపాలకుడి కంఠస్వరం విని ఉలిక్కిపడి, వెంటనే తేరుకుని, "లేదు, మిత్రమా! నీ సలహా ప్రకారం కాస్త పెందలాడే ఇక్కడికి వచ్చి కూర్చున్నాను. అంతే! ఇంతకు ముందు ఎవరో కొందరు స్త్రీలు ఉద్యానవనంలో తిరగడం చూశాను," అన్నాడు మహేంద్రనాధుడు, ఏమాత్రం ఆసక్తి లేనివాడిలాగా.

"స్త్రీలా? నువ్వు వాళ్ళను అంతకు ముందు చూశావా?" అని అడిగాడు ద్వారపాలకుడు.

"లేదు," అన్నాడు మహేంద్రనాధుడు తల అడ్డంగా ఊపుతూ.

"అయితే, వాళ్ళను ఇక మీదట చూసే అవకాశం కూడా నీకు లేదు. ఎందుకంటే వచ్చిన పండితులందరూ తిరిగివెళు తున్నారు. ఒక పల్లకీని తీసుకురమ్మని యజమాని ఆజ్ఞాపించాడు. ఆయన పల్లకీలో వెళ్ళడం నేనెప్పుడూ చూడలేదు. బహుశా, అది ప్రస్తుతం భవనంలో ఉన్న యువరాణి కోసమే అయి ఉంటుంది. ఆమె వెళ్ళిందంటే ఆమె వెంట స్త్రీలందరూ కూడా వెళ్ళిపోతారు కదా!" అన్నాడు ద్వార పాలకుడు నవ్వుతూ.



"అలాగా!" అన్నాడు మహేంద్రనాధుడు.

"అవును మిత్రమా! ఈ ఒక్కరాత్రి చాలా జాగ్రత్తగా ఉండు," అని చెప్పి వెళ్ళిపోయాడు ద్వారపాలకుడు.

మహేంద్రనాధుడి మనసులో మళ్ళీ అలజడి ప్రారంభమయింది. ద్వార పాలకుడు చెప్పిన విషయాన్ని యువరాణికి తెలియజేయడం ఎలాగా అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. అర్ధరాత్రి దాటింది. భవనం లోని దీపాలన్నీ ఆరిపోయాయి. మహేంద్ర నాధుడు చప్పుడు కాకుండా మెల్లగా భవనంలోకి ప్రవేశించాడు. ప్రధాన ద్వారం తలుపులు మూసి ఉన్నాయి. గొళ్ళాన్ని పట్టుకుని కాస్త అటూ ఇటూ కదిలించి చూశాడు. లోపల గడిపెట్టినట్టున్నది. ఇంకొక తలుపు ఉన్నదేమో అనుకుని పక్కలకు వెళ్ళిచూసి కనిపించకపోయేసరికి మళ్ళీ వెనక్కు వచ్చి, తలుపును ఎడమ చేత్తో ముందుకు - తోశాడు. అంతే! తలుపులు అమాంతంగా తెరుచుకున్నవి. ఎదుట సన్నటి మార్గం కనిపించింది. రెండువైపులా తలుపులు మూసిన గదులు. ఎక్కడా మనుషుల అలికిడి లేదు. మహేంద్రనాధుడు ఆ మార్గంకుండా వెళ్ళి, చివర ఉన్న మెట్ల మీదుగా పై అంతస్తుకు చేరుకున్నాడు. అక్కడ కూడా సన్నటి మార్గమూ, రెండు వైపులా తలుపులు మూసిన గదులూ కనిపించాయి. అయితే, అతడు ఎడమచేత్తో తాకగానే తలుపులు



వాటంతట అవి లోపలికి తెరుచుకోసాగాయి. అలా అతడు ఒక గదిలోకి ప్రవేశించాడు. ఎవరో ఎదుట నిలబడినట్టనిపించి ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాడు. అయితే, అది ఎదురుగుండా ఉన్న నిలువుటద్దంలో పడిన తన ప్రతిబింబమే అని వెంటనే గ్రహించాడు. ఆ గదినిండా నిలువుటద్దాలు అమర్చబడి ఉన్నాయి. మసక చీకటిలో ఎటువైపు తిరిగినా తన నీడే కనిపించింది. అక్కడి నుంచి పక్క గదిలోకి వెళ్ళాడు.

ఆ గది కూడా ఖాళీగానే ఉన్నది. అక్కడి నుంచి మూడవ గదిలోకి వెళ్ళాడు. అక్కడ కొందరు స్త్రీలు మంచాలపై పడుకుని నిద్రపోతున్నారు. వాళ్ళల్లో యువరాణి ఉన్నదా అని కొంతసేపు పరిశీలించి చూసి, కనిపించకపోయేసరికి, అక్కడి నుంచి పక్కగదిలోకి వెళ్ళాడు. అక్కడా కొంతమంది స్త్రీలు నిద్రపోతున్నారు. ఆఖరికి మహేంద్రనాధుడు ఐదవ గదిలోకి ప్రవేశించాడు. అక్కడ హంసతూలికాతల్పం మీద ఒక యువతి నిద్రపోతున్నది. ఆమె యువరాణి అయివుంటుందని గ్రహించి, ఆమెను సమీపించబోయినప్పుడు, అతని ఎడమ చేతి వేలికి పెట్టుకున్న ఉంగరం ఒకసారి తళుక్కున మెరిసింది. మార్గమధ్యంలో ముని ప్రసాదించిన ఉంగరం మహిమ కారణంగానే తలుపులువాటంతట అవి తెరుచుకున్నాయని అతడు గ్రహించాడు. అతడు యువరాణి భుజాన్ని మెల్లగా తాకాడు. ఆమె ఉలిక్కిపడి లేచి, మరుక్షణమే తల్పం పై నుంచి దిగి, "మహేంద్రనాధా! నువ్వు ఇక్కడికి ఎలా వచ్చావు?" అని అడుగుతూ అతని వెంట వెలుపలికి వచ్చింది.

"ఆ సంగతి తరవాత చెబుతాను. రేపు నీ ప్రయాణానికి పల్లకీ సిద్ధంగా ఉన్నది. ఈ భవనం యజమాని ఏర్పాటుచేసి ఉన్నాడు!" అన్నాడు మహేంద్రనాధుడు.

"ఎక్కడికి తీసుకువెళతారు?" అని అడిగింది యువరాణి.

"ఆ విషయం నాకు తెలియదు యువరాణీ! వాళ్ళు తీసుకువెళ్ళే చోటికి



వెళ్ళడానికి నీకు సమ్మతమా, కాదా అన్న విషయం నాకు తెలియాలి," అన్నాడు మహేంద్రనాథుడు.

"నేను వాళ్ళతో వెళ్ళను. నా తల్లి దండ్రులను చూడాలి. నువ్వు సహాయం చేయగలవా?" అని అడిగింది యువరాణి.

"నిన్ను మన రాజ్యానికి తీసుకుపోయి, రాజుగారికి అప్పగించడానికే నేను వచ్చాను యువరాణీ! అందుకు రాజుగారి అనుమతి కూడా పొందాను. మీ కుడిభుజంమీద పుట్టుమచ్చ ఉన్నట్టు రాజుగారు ఆనవాలుగా చెప్పమన్నారు. మీరు నన్ను నమ్మాలి!" అన్నాడు మహేంద్రనాథుడు.

యువరాణి సరే అన్నట్టు తల పంకించి "మరి ఆలస్యం ఎందుకు? ఇప్పుడే వెళ్ళి పోదాం!" అన్నది.

"అవును. అదే ఉత్తమం. నా దగ్గర ద్వారంతలుపుతాళంచెవి ఉన్నది. అయినా, ఈ అపరాత్రి వేళ బయలుదేరడానికి నీకు భయంగా లేదు కదా!" అని అడిగాడు మహేంద్రనాథుడు.


"లేదు. ఇక్కడ వుండి, తెల్లవారగానే ఏం జరుగుతుందో అని భయపడడం కన్నా, ఇక్కడి నుంచి వెళ్ళిపోవడమే మేలు. నువ్వు, తోడుగా ఉన్నావు కదా! మరింకేం భయం, కాలయాపన చేయకుండా వెళ్ళి పోదాం!" అన్నది యువరాణి.

"అలాగే యువరాణీ! భవనం నుంచి బయటపడేవరకు నువ్వు నా వెంట కొద్ది దూరంలో నిశ్శబ్దంగా నడిచి రావాలి," అని హెచ్చరించి మహేంద్రనాథుడు భవనం వెలుపలికి నడిచాడు.

ఇద్దరూ వెలుపలి ద్వారాన్ని సమీపించారు. అంతా నిశ్శబ్దంగా ఉన్నది. మహేంద్రనాథుడు, ఏమాత్రం అలికిడి కాకుండా జాగ్రత్తగా తలుపు తెరిచి, మొదట యువరాణిని వెలుపలికి పంపి తానూ వచ్చి, జాగ్రత్తగా లోపలివైపు తాళం వేశాడు.


"మాయాభవనం నుంచి బయటపడ్డాం. మరి ఇప్పుడు ఎటు వెళ్ళాలి? వీరగిరికి వెళ్ళే మార్గం నీకు తెలుసా?" అని అడిగింది యువరాణి. —(ఇంకావుంది)






[యువరాణి ప్రయాణానికి పల్లకీ సిద్ధంగా ఉన్నదని ద్వారపాలకుడి ద్వారా తెలుసుకున్న మహేంద్రనాథుడు, ఆ రాత్రే మాయాభవనం లోపలికి ప్రవేశించి, యువరాణి విద్యావతికి ఆ విషయం తెలియజేశాడు. యువరాణి అప్పటికప్పుడే మాయాభవనం వదిలి వెళ్ళడానికి సమ్మతించింది. ఇద్దరూ ఎంతో జాగ్రత్తగా మాయాభవనం నుంచి బయటపడ్డారు. —తరవాత]

వృద్ధస్త్రీ తెల్లవారుజామున లేచి, తన యజమాని మాట ప్రకారం, యువరాణి విద్యావతిని ప్రయాణానికి సిద్ధం చేయడానికి ఆమె గదిలోకి వెళ్ళింది. కాని, అక్కడ యువరాణి కనిపించలేదు. పక్క గదిలోకి వెళ్ళి చూసింది. ఆ గది తలుపులు కూడా తెరిచి ఉన్నవేగాని అక్కడ కూడా యువరాణి లేదు. అమితాశ్చర్యంతో వృద్ధస్త్రీ గదులన్నిటినీ వెతికింది. కిటికీల వద్ద చూసింది. ఎక్కడా యువరాణి జాడలేదు. పరిచారిక మాలిని గదిలోకి వెళ్ళింది. ఆ గది తలుపులు కూడా తెరిచే ఉన్నాయి. వృద్ధస్త్రీ కిందికి దిగి, ఉద్యానవనద్వారం దగ్గరికి వెళ్ళింది. ద్వారం తలుపులు తెరిచి ఉన్నాయి. అలాగే వెలుపలి ద్వారం దగ్గరికి వెళ్ళిచూసింది. ఆ తలుపులు మాత్రం మూసిఉన్నాయి. పెద్దతాళంవేలాడుతున్నది. ద్వారపాలకుడు లేడు. ఆమె వెనుతిరిగి



భవనం లోపలికి గబగబా నడిచింది. కొంతసేపట్లో పల్లకీ వస్తుంది. అందులో యువరాణిని జాగ్రత్తగా తీసుకుని, తనను పల్లకీవెంట తోడుగా రమ్మని యజమాని నిన్న ఆజ్ఞాపించాడు. మరి ఇప్పుడు యువ రాణి కనిపించడం లేదు. ఏం చేయాలి? ఈ సమయంలో భయపడి ప్రయోజనం ఏమిటి? గండం గడవడానికి వృద్ధస్త్రీ క్షణంలో ఒక ఉపాయం ఆలోచించింది. వెంటనే పరిచారిక మాలిని గదిలోకి వెళ్ళి ఆదమరచి నిద్రపోతూన్న, ఆమెను తట్టిలేపి, "ఆభరణాలు ధరించి, అలంకరించుకుని ప్రయాణానికి వెంటనే సిద్ధం కా!" అని ఆజ్ఞాపించింది వృద్ధస్త్రీ.

కొంతసేపటికి ఆమె మాలినిని మెట్ల గుండా కిందికి తీసుకువచ్చింది. అక్కడ ఒక పల్లకీ సిద్ధంగా ఉన్నది. అది తన కోసమే అని నమ్మలేక, మాలిని, "ఇందులోనా! నేను ఎక్కడికి వెళ్ళాలి?" అని అడిగింది ఆశ్చర్యంగా.

"అవును. అది నీ కోసమే. ఎక్కడికి వెళ్ళాలన్న విషయం నీకు అనవసరం. పల్లకీ వెంట నేను నడిచి వస్తాను. నీకు ఎలాంటి భయమూ వద్దు. నేను చెప్పినట్టు చెయ్యి. ఇది యజమాని ఆజ్ఞ!" అని హెచ్చరించింది వృద్ధస్త్రీ.


మాలిని మారుమాట్లాడకుండా వెళ్ళి పల్లకీలో కూర్చుని తెరను దించింది. బోయీలు పల్లకీ నెత్తుకున్నారు. భవన ద్వారం తలుపులు మూసుకుని వృద్ధస్త్రీ కూడా పల్లకీ వెంట నడవసాగింది.

మాయాభవనం నుంచి బయటపడి అంతకు ముందే అరణ్యంలోకి చేరిన మహేంద్రనాథుడికీ, యువరాణి విద్యావతికీ ఒక మార్గం కనిపించింది. వాళ్ళు వేరెవరికంటా పడకూడదన్న జాగ్రత్తతో– కొంతదూరం నడిచి వెనకకు తిరిగిచూస్తూ, ఏదైనా అలికిడి వినిపించినప్పుడు పక్కకు తప్పుకుని చుట్టుపక్కలు పరిశీలించు కుంటూ ముందుకు నడవసాగారు. కొంత సేపటికి వాళ్ళకు దూరంనుంచి బోయీల పాటవినిపించింది. చప్పునవాళ్ళు ఒక పొద

చాటున దాక్కున్నారు. మరి కొంతసేపటికి నలుగురు బోయీలు ఒక పల్లకీని మోసు కుంటూ ఆ మార్గం గుండా వాళ్ళను దాటు కుని వెళ్ళిపోయారు. పల్లకీ వెంట వృద్ధస్త్రీ నడుస్తున్నది. పల్లకీలో వెళుతున్నది ఎవరో తెలియలేదు. పల్లకీ తనకోసమే వచ్చింది కదా? మరి అందులో ఇప్పుడు ఎవరు వెళుతున్నారో అని ఆలోచించ సాగింది యువరాణి.

"యువరాణీ! మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. వేషాలు కూడా మార్చుకోవడం మంచిది!" అన్నాడు మహేంద్రనాథుడు.

"నిజమే! తెల్లవారాక మార్చుకుందాం." అన్నది యువరాణి.




తెల్లవారే సమయానికి బోయీలు మోసుకు వెళ్ళిన పల్లకీ ఒక సమతల ప్రదేశాన్ని చేరుకున్నది. అక్కడ మరిద్దరు బోయీలు వేరొక పల్లకీతో సిద్ధంగా ఉన్నారు. వాళ్ళకు దాపుల ముగ్గురు వ్యక్తులు గుర్రాల మీద ఉన్నారు. ఆ ముగ్గురిలో ఒక వ్యక్తి వృద్ధస్త్రీని సమీపించి, "యువరాణిని ఆ పల్లకీ నుంచి ఈ పల్లకీలోకి రమ్మను," అని ఆజ్ఞాపించాడు.

ఆ మాటలకు ఆశ్చర్యపోయిన వృద్ధస్త్రీ, "యజమాని ఎక్కడ? నేనాయనతో మాట్లా డాలి!" అన్నది.

"యజమాని మా కోసం మరొక చోట వేచి ఉన్నాడు. యువరాణిని క్షేమంగా ఆయన దగ్గరికి చేర్చే బాధ్యత మాది. నీకా విచారం వద్దు. నువ్వు ఈ పల్లకీలోనే మాయాభవనం చేరవచ్చు!" అని ఆజ్ఞాపిం చాడావ్యక్తి.

అతడి కంఠస్వరం తన యజమాని కంఠస్వరంలాగే ఉండడంతో ఒక్కక్షణం ఉలిక్కి పడిన వృద్ధస్త్రీ, అతని ముఖాన్ని ఒకసారి తేరిపార చూసింది. అతనికి గడ్డం లేదు. ముఖంలో రాచఠీవి ఉట్టిపడు తున్నది. చూడడానికి ఎవరో రాకుమారుడి లాగా ఉన్నాడు.

ఇక చేసేది లేక ఆమె అతని ఆజ్ఞాను సారం మాలినిని ఆమె ఉన్న పల్లకీ నుంచి దించి, కొత్త పల్లకీలోకి పంపుతూ, "వీళ్ళు



నిన్ను సురక్షితంగా యజమాని దగ్గరికి చేర్చగలరు. భయపడ వద్దు!" అని చెప్పి పల్లకీ తెర మూసింది.

మరుక్షణమే గుర్రాలపై వున్న ముగ్గురు వ్యక్తుల వెంట పల్లకీ కదిలింది.


వృద్ధస్త్రీ, అంతకు ముందు మాలిని వచ్చిన పల్లకీలో మాయాభవనానికి వెను తిరిగింది.

సూర్యోదయం కాగానే మార్గం స్పష్టంగా కనిపించడంతో,మహేంద్రనాధుడూ, యువ రాణీ అమితోత్సాహంతో వేగంగా కొండ దిగనారంభించారు. అలా వాళ్ళు నడిచి నడిచి, మిట్టమధ్యాహ్న సమయానికి కొండ పాదతలం చేరి, కొంతసేపు విశ్రాంతి తీసుకుని, మళ్ళీ ప్రయాణం కొనసాగించారు. పడమటి దిశలో పొద్దువాలుతూ ఉండగా వాళ్లొక సమతల ప్రదేశం చేరుకున్నారు. దూరంగా ఒక కుటీరం కనిపించింది. అది తనను దీవించి పంపిన ముని కుటీరమే అని గ్రహించి మహేంద్రనాధుడు పరమానందం చెందాడు. తన వేలికి ఉన్న ఉంగరాన్ని కృతజ్ఞతగా ఒకసారి చూసుకున్నాడు. ముని తనకు మహిమగల ఉంగరాన్ని ఇచ్చి ఆశీర్వదించి పంపిన విషయాన్ని యువరాణికి తెలియజేశాడు. ఆయనకిచ్చిన మాట ప్రకారం తిరుగు ప్రయాణంలో ఆయనను దర్శించుకుని వెళ్ళవచ్చు అనుకుంటూ అతడు ఆ కుటీరం కేసి నడిచాడు.

అంతలో కుటీరం నుంచి వెలుపలికి వచ్చిన ముని చిరునవ్వుతో, "రా, నాయనా! నువ్వీకార్యంసాధించగలవని నాకుతెలుసు. వీరగిరి యువరాణి విద్యావతికి స్వాగతం!" అన్నాడు.

"మా రాక కోసమే తమరు ఎదురు చూస్తున్నట్టున్నారు. మేము రావడం మీకెలా తెలిసింది?" అని అడిగాడు మహేంద్ర నాధుడు.

ముని తన వేలికి పెట్టుకున్న ఉంగరాన్ని చూపి, "ఈ ఉంగరానికీ, ఆ రోజు నేను నీకిచ్చిన ఉంగరానికీ కొన్ని మహిమలు ఉన్నాయి. ఈ ఉంగరాన్ని నేను ధరించ





గానే, అది నీకు తెలియకుండానే నీ ఉంగరం ద్వారా నిన్ను నా సమక్షానికి నడిపించింది," అన్నాడు.

"అలాగా!" అంటూ మునికి నమస్కరించాడు మహేంద్రనాధుడు.

"మీరిద్దరూ ఇక్కడికి రావడం నాకెంతో ఆనందంగా ఉన్నది. ఈ రాత్రి ఈ కుటీరంలోనే గడిపి, తెల్లవారగానే బయలుదేరండి!" అన్నాడు ముని.

ఆ రాత్రి నిద్రపోవడానికి ముందు, మహేంద్రనాధుడూ, యువరాణీ వాళ్ళు అక్కడికి చేరడానికి పూర్వం జరిగిన విశేషాలన్నిటినీ మునికి వివరించారు. ముని వాటిని చిరునవ్వుతో విన్నాడు.

మరునాడు తెల్లవారగానే, ముని మహేంద్రనాధుణ్ణీ, యువరాణినీ దగ్గరికి పిలిచి, "మీతోపాటు నేనూ రాజధానీ నగరానికి వస్తాను. అది మీకు కొంత రక్షణగానూ ఉంటుంది. ఇంత కాలానికి నా కర్తవ్యాన్ని నెరవేర్చడానికి కలిగిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను," అన్నాడు చిరునవ్వుతో.

"ఏమిటి?" అన్నట్టు ఆశ్చర్యంగా చూశాడు మహేంద్రనాధుడు.

"మీకా విషయం తెలియాలంటే, నా కథ కూడా కొంత తెలుసుకోవాలి," అన్నాడు ముని.

"చెప్పండి!" అన్నాడు మహేంద్రనాధుడు ఉత్సాహంగా.

"అదొక పెద్ద విషాద గాథ. అయినా, మీకది క్లుప్తంగా తెలియజేస్తాను," అంటూ ముని ఇలా చెప్పాడు:

"మహిమాపురి రాజ్యం గురించి మీరు వినే ఉంటారు. యువరాజు వీరేంద్రనాధుడు యువకుడుగా ఉన్నప్పుడు అతని తండ్రి వేటకుపోయి, ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. ఇరవై ఒకటవ యేట వీరేంద్రనాధుడికి రాజ్యాభిషేకం జరిగింది. అయినా, సోదరి ఐశ్వర్యను ఆయనకు అప్పగించి అతని తల్లి కూడా కన్ను మూసింది. ధర్మనిరతుడూ, భక్తితత్పరుడూ అయిన వీరేంద్రనాధుడు ప్రజా

రంజకంగా పరిపాలన సాగించాడు. సహోదరి ఐశ్వర్యను పొరుగు రాజ్యం యువరాజు అయిన సురేంద్రనాథుడికిచ్చి పెళ్ళిచేశాడు. వారి కొక మగశిశువు కలిగాడు. వీరేంద్రనాథుడు తరుచూ తీర్థయాత్రలకు వెళ్ళేవాడు. ఆ కారణంగా సురేంద్రనాథుడూ, అతని తమ్ముడైన, జితేంద్రనాథుడూ మహిమాపురిలోనే ఉండే వారు.

ఒకసారి వీరేంద్రనాథుడు తీర్థయాత్రకు వెళ్ళడం తెలిసి, పాటలీపురరాజు మహిమాపురి మీదికి దండెత్తి వచ్చాడు. యుద్ధంలో సురేంద్రనాథుడు మరణించాడు. సురేంద్రనాథుడి భార్య ఐశ్వర్యనూ, బిడ్డనూ, తమ్ముడు జితేంద్రనాథుణ్ణీ శత్రువులు రాజ్యం నుంచి తరుమగొట్టారు. తీర్థయాత్రల నుంచి తిరిగి వచ్చిన వీరేంద్రనాథుణ్ణి పట్టి బంధించారు. తన తోబుట్టువు దూరం కావడంతో రాజు తీరని విచారంతో కారాగారంలోనే మరణించాడు.

జితేంద్రనాథుడు అన్న కుమారుణ్ణీ, ఐశ్వర్యనూ తీసుకొని ఎక్కడెక్కడో తిరిగి, ఆఖరికి వీరగిరి రాజ్యానికి చేరుకున్నాడు. అక్కడ కొంతకాలం ఒడిదుడుకులతో గడిచింది. జితేంద్రనాథుడు ఒక యువతిని పెళ్ళాడాడు. అయితే, హఠాత్తుగా ఆమె కూడా మరణించడంతో, జీవితం మీద విరక్తి పుట్టి, జితేంద్రనాథుడు ఇల్లు వదిలి దేశాటనకు బయలుదేరి, ఆఖరికి ఒక అరణ్యంలో కుటీరం నిర్మించుకొని కాలం



గడుపుతున్నాడు. అనాథగా వదిలి వచ్చిన వదినెనూ, మహిమాపురి సింహాసనానికి వారసుడైన ఆమె కుమారుణ్ణీ చూడడానికైనా వెళ్ళలేదు!"

ఆ మాటలతో ముని రెండు కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి.

"ఆమె కుమారుడి పేరేమిటో చెప్పలేదు!" అన్నది యువరాణి.

"మహేంద్రనాథుడు!" అన్నాడు ముని ఎంతో ఆనందంగా.

మహేంద్రనాథుడు, ముని తన పినతండ్రి జితేంద్రనాథుడని గ్రహించి, ఆయనను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

"నేను రాజధానికి వచ్చి రెండు కర్తవ్యాలను నెరవేర్చాలి. మహేంద్రనాథు డెవరో రాజుగారికి తెలియజేయాలి. మహేంద్రనాథుడి తల్లిగారికి చెప్పా పెట్టకుండా హఠాత్తుగా ఇల్లు వదిలిపెట్టినందుకు క్షమాపణలు చెప్పుకోవాలి. ఆ తరవాత నేను ఇక్కడికి నిశ్చింతగా తిరిగి వచ్చి, ఈ ప్రశాంత వాతావరణంలో కాలం వెళ్ళబుచ్చుతాను," అన్నాడు ముని ప్రసన్న వదనంతో.


మహేంద్రనాథుడూ, విద్యావతీ ఏదో చెప్పబోయారు.

అయినా ముని వారిస్తూ, "మీరు ఆశ్రమవాసుల దుస్తులు ధరించండి. నేనూ మీ వెంట ఉన్నాను గనుక, మిమ్ములను ఎవరూ గుర్తు పట్టలేరు. ఇప్పుడు బయలుదేరామంటే సూర్యాస్తమయ వేళకు రాజధానీ నగరం చేరుకోగలం. అక్కడి నుంచి తిన్నగా రాజప్రాసాదం చేరుకుందాము," అన్నాడు.

"ఇప్పుడే రాజప్రాసాదం చేరుకున్నంత ఆనందంగా ఉన్నది మహాత్మా!" అంటూ యువరాణి, ఆభరణాలన్నిటినీ క్షణంలో తీసివేసి, కుటీరం లోపలికి వెళ్ళి, బట్టలు మార్చుకుని మునికుమారిలా తిరిగి వచ్చింది. మహేంద్రనాథుడు కూడా ముని కుమారుడిలా తయారయ్యాడు.

ముగ్గురూ వీరగిరి రాజ్యం కేసి బయలుదేరారు. —(ముగింపు వచ్చే సంచికలో)







[మాయాభవనం నుంచి తప్పించుకున్న యువరాణి విద్యావతీ, మహేంద్రనాధుడూ సాయంకాలానికి కొండపాదతలంలోని ముని కుటీరాన్ని చేరుకున్నారు. వారిని చూసి సంతోషించిన ముని తన వృత్తాంతం తెలియజేశాడు. ముని, తన పినతండ్రి జితేంద్రనాధుడని మహేంద్రనాధుడు గ్రహించాడు. ముగ్గురూ సంతోషంగా వీరగిరి రాజ్యానికి బయలుదేరారు. —తరవాత]

యువరాణి కనిపించకుండాపోయి రెండు వారాలు గడిచిపోయింది. ఇంకా ఆమె జాడ తెలియకపోయేసరికి, రాజు ప్రస్తుత గ్రహస్థితి ఎలాఉన్నదో తెలుసుకోవడానికి వాచస్పతాచార్యులను పిలిపించాడు. వాచస్పతాచార్యులు వచ్చి రాజ దంపతులకు నమస్కరించాడు. అప్పుడు అక్కడేఉన్న సేనాధిపతి ఉగ్రసేనుడు, "జగత్పతాచార్యుడి విషయం ఏమైనా తెలిసిందా?" అని అడిగాడు.

రాజు వీరసేనుడు, "జగత్పతి ఇతర జ్యోతిష్కులతో సంప్రదించిన విషయాలేమిటో తెలిశాయా, ఆచార్యా!" అని అడిగాడు.

"ఇప్పటి వరకు ఏ ఒక్క విషయమూ తెలియరాలేదు, ప్రభూ! నేను నా శిష్యుడు మంజునాధుణ్ణి, వివరాలు సేకరించుకుని రమ్మని పంపాను. అతడు రేపో మాపో రాగలడని ఆశిస్తున్నాను. యువరాణి జాతకం ప్రకారం ఆమెకు ఇప్పుడు శుభ



సమయం ఆసన్నమయింది. గ్రహబలం ప్రకారం ఆమె ఈపాటికి రాజధానీ నగరం చేరుకుని ఉండాలి. ఒంటరిగా కాకుండా ఆమె మరిద్దరితోపాటు వస్తూ ఉండాలి," అన్నాడు వాచస్పతాచార్యులు.

"మంచిమాట చెప్పారు ఆచార్యా! నా బిడ్డ క్షేమంగా వచ్చి చేరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను," అన్నది రాణి వజ్రేశ్వరీదేవి.

"ఉగ్రసేనా! నగరం ప్రధాన వీధులన్నిటిలోనూ భటులను అప్రమత్తంగా ఉండమని ఆజ్ఞాపించు!" అన్నాడు రాజు సేనాధిపతితో.

"చిత్తం, మహారాజా!" అని చెప్పి అతడు అక్కడి నుంచి భవనం వెలుపలికి నడవ సాగాడు. అప్పుడొక భటుడు ఎదురుపడి, సేనాధిపతికి నమస్కరించి, "ప్రభూ! రాజ ప్రాసాదం ముందు ఒక పల్లకీవచ్చి ఆగింది. పల్లకీవెంట ముగ్గురుగుర్రాలమీద వచ్చారు. వారిలో ఒకడు రాజదర్శనం కావాలని కోరుతున్నాడు!" అని చెప్పాడు.

"అతని పేరేమిటో చెప్పాడా?" అని అడిగాడు సేనాధిపతి.

"లేదు ప్రభూ! చూడడానికి ఏదో రాజ వంశానికి చెందిన వ్యక్తిలాగా ఉన్నాడు," అన్నాడు భటుడు.

"పల్లకీలో ఎవరున్నారో చూశావా?" అని అడిగాడు సేనాధిపతి.


"లేదు ప్రభూ! తెర అడ్డుగా ఉన్నది," అన్నాడు భటుడు.

"సరే, వెళ్ళు. నేను ఇప్పుడే వస్తాను," అని చెప్పి సేనాధిపతి లోపలికి వెళ్ళి, ఇంకా జ్యోతిషాచార్యులతో మాట్లాడుతున్న రాజ దంపతులకు సంగతి చెప్పాడు.

వెంటనే రాణి వజ్రేశ్వరీదేవి, "ప్రభూ! పల్లకీలో మన కుమార్తె ఉన్నదేమో! ఏ రాకుమారుడో ఆమెను రక్షించి తెచ్చి ఉండవచ్చు. రండి,వెళ్ళిచూద్దాం!"అన్నదిఆత్రుతగా.

"వచ్చినది మన కుమార్తె విద్యావతి అయినట్టయితే ఆమె ఇంకా ఎందుకు పల్లకీలోనే ఉంటుంది?రాజభవనం ఆమెకు కొత్త కాదు కదా? ఈ సరికి లోపలికి వచ్చి ఉంటుంది కదా!" అంటూ రాజు ఆసనం నుంచి లేచాడు.

ముగ్గురూ సేనాధిపతి వెంట భవనం వెలుపలికి నడవసాగారు. వాళ్ళు భవనం సింహద్వారం చేరే సరికి పల్లకీ దించబడి ఉన్నది. గుర్రాల మీద వచ్చిన ముగ్గురిలో ఒక వ్యక్తి గుర్రం దిగి, లోపలికి వస్తూ రాజుకు నమస్కరించాడు.



రాజు, "నువ్వు..." అని అన్నంతలో అతడు అడ్డుపడి, "హిమగిరి రాజ్యాన్ని పాలించిన త్రిలోకపతి మనవణ్ణి," అన్నాడు.

"హిమగిరి రాజు ఉమాపతి కదా?" అన్నాడు రాజు అనుమానంగా.

"నిజమే, రాజా! అతడు త్రిలోకపతిని పదవీచ్యుతుణ్ణి చేసి, ఆయన సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. నేను త్రిలోకపతి తమ్ముడైన కైలాసపతి మనవణ్ణి. ఉమాపతి, హిమగిరి సింహాసనాన్ని ఆక్రమించిన తరవాత, మా తాత కైలాసపతీ, తండ్రి గజపతీ, నేనూ రాజ్యాన్ని వదిలిపెట్టవలసిన నిర్బంధం ఏర్పడింది. నా పేరు జగత్పతి!" అని వివరించాడా వ్యక్తి.

జగత్పతి అన్న పేరు వినగానే రాజూ, వాచస్పతాచార్యులూ విస్మయంతో ఒక్క క్షణం ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

ఉగ్రసేనుడి కుడిచేయి, నడుముకు వేలాడుతూన్న ఒరమీదికి చేరి కత్తి పిడిని ఒడిసి పట్టుకున్నది.

"నేను మీకొక శుభవార్త తెచ్చాను, ప్రభూ! మీ కుమార్తె విద్యావతిని రక్షించి, తీసుకు వచ్చాను. ఆమె పల్లకీలో ఉన్నది!" అన్నాడు జగత్పతి పల్లకీ కేసి చూపుతూ.

"నా ముద్దుల కుమార్తె విద్యావతి పల్లకీలో ఉన్నదా?" అంటూ రాణి అటుకేసి ఒక అడుగు వేసింది.

మహారాజు ఆమెను చూపులతో వారిస్తూ, "పల్లకీలో ఉన్నది విద్యావతి అయినట్ట యితే, ఆమె ఇంకా ఎందుకు దిగిరాదు? రాజప్రాసాదం ఆమెకు కొత్త కాదు కదా? ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నది కదా?" అని అడిగాడు జగత్పతిని.

"ఆమె సురక్షితంగా ఉన్నది ప్రభూ! ఆమెను ఇప్పుడే వెలుపలికి రమ్మంటాను," అంటూ జగత్పతి పల్లకీని సమీపించి,



తెరను పక్కకు తొలగించి, "రా, యువరాణీ! మీ తల్లిదండ్రులు నీ కోసం ఎదురు చూస్తున్నారు!" అన్నాడు.

పల్లకీలో కూర్చుని ఉన్న మాలిని తనను ఎవరో 'యువరాణీ' అని సంబోధించడం విని, ఉలిక్కి పడింది.

"యువరాణీ! త్వరగా వెలుపలికిరా! నిన్ను చూడడానికి నీ తల్లిదండ్రులు తపించి పోతున్నారు!" అని హెచ్చరించి, జగత్పతి రాజదంపతులు ఉన్నచోటికి నడిచాడు.

తెర తొలగించుకుని వెలుపలికి వచ్చిన మాలిని బెదురుతూ దిక్కులు చూస్తూ అడుగులు వేయసాగింది. దూరం నుంచి చూడడానికి తమ కుమార్తెలాగే ఉన్న ఆ యువతి చూపులలో అంతటి బెదురు ఎందుకు వచ్చిందో రాజదంపతులకు అంతుబట్టలేదు.

సేనాధిపతి ఒక్క ఊపులో ముందుకు దూకి జగత్పతి చేయి పట్టుకుని, "ఆ యువతి యువరాణి విద్యావతికాదు. నువ్వు పొరబడినట్టున్నావు," అన్నాడు అధికారం ధ్వనించే కంఠస్వరంతో.

"ఆమె యువరాణి విద్యావతి. అందులో సందేహం లేదు!" అన్నాడు జగత్పతి.


"ఆ విషయం నీకెలా తెలుసు? యువరాణిని ఇంతకు ముందెప్పుడయినా చూశావా?" అని అడిగాడు సేనాధిపతి.

ఆ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా, "నేను ఆమెను దుండగుల నుంచి రక్షించి, నా భవనానికి తీసుకుపోయి, ఆమె మీద గ్రహాల దుష్ప్రభావం తొలగిపోయేంత వరకు, ఆమెకు ఎలాంటి కొరతా లేకుండా కాపాడి, ఇక్కడికితీసుకువచ్చాను," అన్నాడు జగత్పతి.

"యువరాణి మీద గ్రహాల దుష్ప్రభావం పడిందని నీకెలా తెలిసింది?" అంటూ వాచస్పతాచార్యులు ముందుకు వచ్చి, జగత్పతి మరొక చేతిని పట్టుకున్నాడు.

"ఆ విషయం నాకు జ్యోతిష పండితులు చెప్పారు," అన్నాడు జగత్పతి.

"నువ్వు ఇన్ని రోజులు కనిపించకుండా పోవడానికి కారణం ఇదా? విశ్వాసఘాత


RAZI



కుడా! యువరాణి గ్రహస్థితిని తెలుసుకుని, నువ్వే ఆమెను అపహరించుకుని పోయి ఎక్కడో దాచావు! ఆమెను తెచ్చి రాజుకు అప్పగించడానికి మంచి ముహూర్తంకోసం జ్యోతిష పండితులతో చర్చలు జరిపావన్న మాట! జగత్పతీ! నీ నీచకృత్యానికి సిగ్గుపడుతున్నాను," అంటూ వాచస్పతాచార్యులు అతడి చేతిని వదిలిపెట్టాడు.

వెంటనే జగత్పతి తన కంఠహారంలోని తాయెత్తును చేత్తో గట్టిగా పట్టుకున్నాడు. ఆ క్షణమే ఒక మెరుపు మెరిసి మరుక్షణంలో ఆ ప్రదేశాన్నంతటినీ దట్టమైన పొగ ఆవరించింది. అదే అదనుగా జగత్పతి, సేనాధిపతి నుంచి రెండవ చేయిని కూడా విడిపించుకుని భవనం వెలుపలికి పరిగెత్తాడు. వాడు సింహద్వారాన్ని సమీపించి, గుర్రంమీదికి లంఘించబోతున్న సమయంలో, అటుగా వచ్చిన మహేంద్రనాథుడు— ఎవడో చేతిలో హారాన్ని పట్టుకుని పరిగెత్తుతున్నాడని భావించి, వాడికి అడ్డుతగిలాడు. వాడిచేయి పట్టుకునిలాగి కింద పడదోసి, మరొక చేత్తో వాడితలకు పెట్టుకున్న కిరీటంవంటి తల పాగాను కిందపడేట్టు కొట్టాడు. దాంతో జగత్పతి చేతిలోని హారం తాయెత్తుతో సహా మహేంద్రనాథుడి చేతిలోకి వచ్చింది. దానిని వడిసి పట్టుకుని మహేంద్రనాథుడు, "నీ మాయలు ఇక సాగవు," అన్నాడు.

అంతలో రాజదంపతులతో సహా అక్కడికి వచ్చిన వాచస్పతాచార్యులు, "ఆ దుర్మార్గుణ్ణి పట్టి బంధించండి," అని ఆజ్ఞాపించాడు.

వెంటనే భటులు జగత్పతిని పట్టుకుని పెడరెక్కలు విరిచి బంధించారు. అప్పుడు సేనాధిపతి మహేంద్రనాథుణ్ణి గుర్తించి, "నువ్వు వచ్చావా? ఈ దుర్మార్గుణ్ణి పట్టుకోవడానికి సహాయపడింది నువ్వా? శభాష్. యువరాణి ఎక్కడున్నదో కనుగొన్నావా?" అని అడిగాడు.

"ఇక్కడే ఉన్నాను. మామయ్యా!" అన్నది యువరాణి విద్యావతి.

ఆమధురకంఠస్వరంవినిపించిన వైపుకు తిరిగిన సేనాధిపతి, మునికుమారిలా ఉన్న

విద్యావతినిచూసి, నవ్వుతూ, "ప్రభూ, విద్యావతి తిరిగి వచ్చింది!" అన్నాడు.

"వచ్చావా, తల్లీ! క్షేమంగా ఉన్నావు కదా?" అంటూ రాణి ఆనందబాష్పాలతో యువరాణిని కౌగిలించుకున్నది.

"విద్యావతీ! ఏమిటీ వేషం?" అంటూ రాజుఆమె తలనుఆప్యాయంగా నిమిరాడు.

ఇంతలో మాలిని వచ్చి యువరాణికి నమస్కరించింది. "పల్లకీలోవచ్చిందినువ్వన్న మాట!" అన్నది యువరాణి నవ్వుతూ.

తరవాత మహేంద్రనాథుడు రాజును సమీపించి నమస్కరించి, "నేను తలపెట్టిన కార్యంలో విజయం సాధించాను, మహాప్రభూ! యువరాణిని వెతికి తెచ్చి మీకు అప్పగించినందుకు నాకెంతో ఆనందంగా ఉన్నది. ఆ కార్యం సులభం కావడానికి అదృష్టవశాత్తు మార్గమధ్యంలో మా పినతండ్రి ఆశీస్సులు కూడా లభించాయి," అంటూ పక్కనే మందహాసంతో నిలబడి ఉన్న మునిని చూపించాడు.

రాజు ఆశ్చర్యంగా మునికేసి చూశాడు.

"వీరు మా పినతండ్రి మహిమాపురికి చెందిన జితేంద్రనాథుడు. సన్యాసం స్వీకరించారు!" అన్నాడు మహేంద్రనాథుడు.

"దేవీ ఆలయ దర్శనానికి వచ్చినప్పుడు రాజు వీరేంద్రనాథుణ్ణి చూశాను. ఆయన శత్రువులకు పట్టుబడి మరణించాడని విన్నాను, మీరు..." అన్నాడు రాజు.



"మాఅన్న సురేంద్రనాథుడు యుద్ధంలో మరణించాడు. అప్పుడు శిశువుగా ఉన్న మహేంద్రనాథుడూ, అతని తల్లీ నేనూ, మహిమాపురి రాజ్యాన్ని వదిలిపెట్టాము. కొన్నాళ్ళకు నేను సన్యాసం స్వీకరించాను. యువరాణిని వెదకడానికివచ్చిన మహేంద్రనాథుడు దైవవశాత్తు నాకు తటస్థపడ్డాడు. అతడే మహిమాపురి రాజ్యవారసుడని మీకు తెలియచేసి, అతని తల్లికి క్షమాపణలు చెప్పుకుని వెళదామనే నేను వచ్చాను," అన్నాడు ముని.

"మంచిది. ఆమె మా రక్షణలో సురక్షితంగా ఉన్నది. ఇప్పుడే పిలిపిస్తాను," అన్నాడు సేనాధిపతి.

"మీరు అనుమతించినట్టయితే నేనే స్వయంగా వెళ్ళి, మా తల్లికి ఈ శుభవార్త అందజేస్తాను," అన్నాడు మహేంద్రనాధుడు.

రాజు సేనాధిపతితో, "ఉగ్రసేనా! మహేంద్రనాధుడికి కావలసిన రక్షణ ఏర్పాట్లు చేయించు. ఈ క్షణం నుంచి, అతడూ, అతని తల్లీ మన అతిథులు!" అన్నాడు.

"ప్రభూ ఒక్క మాట!" అంటూ రాణి వజ్రేశ్వరీదేవి రాజును సమీపించి, "సాహస వీరుడైన మహేంద్రనాధుడు చూడ చక్కగా ఉన్నాడు. మన కుమార్తెకు తగిన వరుడని భావిస్తున్నాను," అన్నది.

ఆ మాటలకు అక్కడి వారందరూ ఆనందం చెందారు. మహేంద్రనాధుడు చిన్నగా నవ్వుతూ, యువరాణికేసి చూశాడు. ఆమె సిగ్గుతో తలవంచుకున్నది.

"మంచికాలం వచ్చింది కదా! అంతా మంచే జరుగుతుంది రాణీ!" అని రాజు మునికేసి తిరిగి, "మహేంద్రనాధుడూ, అతని తల్లీ ఇక్కడికి వచ్చేంతవరకు మీరు ఇక్కడే ఉండవచ్చు!" అని వాచస్పతాచార్యులవైపు తిరిగి, "ఇప్పుడు యువరాణికి గ్రహస్థితి ఎలా ఉన్నదో ఆమె జాతకాన్ని పరిశీలించి తెలియజేయండి. రండి, అందరం లోపలికి వెళ్ళికూర్చుని మాట్లాడుకుందాం!" అంటూ రాజభవనం లోపలికి నడిచాడు.

రాజుకు ఒకవైపున రాణీ, యువరాణీ, ఆమె వెంట పరిచారిక మాలినీ, మరొక వైపున వాచస్పతాచార్యులూ,మునీనడిచారు.

సేనాధిపతి ఉగ్రసేనుడు మహేంద్రనాధుడి భుజం తట్టి అభినందిస్తూ, "నీతో పాటు నేనూ వస్తాను. నీ వంటి సాహస వీరుణ్ణి కన్న ఆ తల్లి ధన్యురాలు! ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ తన రాజవంశం గురించి నీకు తెలియజేయని ఆ మహా సాధ్విని నేనే స్వయంగావచ్చి, సకలమర్యాదలతో రాజప్రాసాదానికి ఆహ్వానిస్తాను," అంటూ భవనం వెలుపలికి వచ్చాడు.

అక్కడ సిద్ధంగా ఉన్న రెండు గుర్రాలను అధిరోహించి, ఇద్దరూ అమితోత్సాహంతో మహేంద్రనాధుడి తల్లి నివాస స్థలానికి బయలుదేరారు. — (అయిపోయింది)

